జూలై - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 07 |
| బైబిల్ కథలు | మామయ్య కథలు<br>రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 10 |
| బైబిలు ప్రాముఖ్యత | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 12 |
| ఏడు సంఘాలు | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 15 |
| ఆశపడ్డ ప్రాణము | సాక్ష్యము | 19 |
| పరలోకము అనగానేమి? | రెవ. ఎ. మత్తయి, వినుకొండ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

పత్రిక అభివృద్ధికి తోడ్పడుతున్న మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. క్రమము తప్పకుండా పత్రిక చందా చెల్లిస్తూ, పత్రికను అనేకమందికి పంపడానికి దోహదపడుతున్న వారికి మా కృతజ్ఞతలు. ప్రభువు పనిలో పాలిభాగస్తులవుతున్నందుకు దేవుడు మీకు ప్రతిఫలము దయచేయునుగాక! చాలామంది మాకు ఫోన్ చేసి చందాకట్టడానికి మా అకౌంట్ నంబరు అడుగుతున్నారు. దయచేసి గమనించండి సంవత్సర చందాదారులు దయచేసి మనియార్డరు ద్వారా మాత్రమే చందా పంపగలరు. సంవత్సర చందా మీరు మా అకౌంట్‌లో వేస్తే మాకు 50 రూపాయలు సర్వీస్ చార్జీ పడుతుంది. జీవిత చందా పంపదలచినచో మా అకౌంట్ నంబరు ఇస్తాము.

మరి ముఖ్యంగా ఈ పత్రికలో ప్రచురిస్తున్న ఆర్టికల్స్ గురించి మీ అభిప్రాయాలను మాకు ఉత్తరము ద్వారా తెలియజేస్తే మేము వాటిని ప్రచురిస్తాము. మీరు మంచి సాక్ష్యము కలిగియున్నట్లయితే, మీ సాక్ష్యము ద్వారా అనేకమంది ప్రభువు దగ్గరకు నడపించబడుటకు దానిని మేము ప్రచురిస్తాము. అంతేకాక మీరు క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మాకు పంపిస్తే వాటిని మేము ప్రచురిస్తాము. ఉత్తమమైన వాటికి నగదు బహుమతి కూడా ఉంటుంది. మీరు పంపదలచిన వాటిని స్కాన్ చేసి మా ఈ-మెయిల్ holiness.ierf@gmail.comకు పంపవచ్చును. అనేకమందిని ప్రభువు దగ్గరకు నడిపించుటకు ఉద్దేశించబడిన ఈ మా పత్రికలో మీరు భాగస్వామ్యులు కావాలని మనసారా కోరుకుంటున్నాము. ప్రభువువైన యేసు కృప ఇప్పుడును ఎల్లప్పుడును సదాకాలము మీకు తోడైయుండను గాక!

–ఎడిటర్

సీరియల్

# బర్నబా

2

**(అపొస్తలుడు రెండవభాగం)**

**- కొడవటికంటి**

యెరూషలేము పట్టణము దేవాలయ ప్రాంగణంలేని ఏంటనీయ శిఖరం నుండి ఉదయ సాయంకాలాలు వినిపించే యాజకుల బూర శబ్దములు, పండుగలు, బలులు, పదిహేను అడుగుల ఎత్తైన దహన బలిపీఠంనుండి యెహోవా ఇంపైన హోమం ఆకాశనులోనికి లేవటం ఇక్కడ లేదు, వీధులలో వేగంగా పరుగెత్తే రకరకాల రధాలు,అంతకంటే వేగంగా పనిచేసే మష్తిష్కాలు. ఇప్పటికి నాలుగు సంవత్సరాల క్రితం చక్రవర్తి బ్రిటానియాని జయించిన సందర్బంగా ముద్రించిన నాణాలు యెరూషలేములో కంటే ఇక్కడ ఎక్కువగా చెలామణిలో ఉన్నవి.

అంతియెకయకు వచ్చిన తరువాత ఆ నాగరికత జీవన సరళి అర్ధం చేసికోవటానికే చాలా సమయం పడుతుంద నిపించింది. అరబ్బీకాని, హెబ్రీ భాష కాని మాట్లాడేవాళ్ళు కనిపించలేదు. కొద్దిమంది యూదులు తప్పితే మిగిలిన వాళ్ళంతా మాట్లాడేది గ్రీకు భాష మాత్రమే. ఈ నెల రోజులలో సంఘంలో చేరిన శిష్యుల సంఖ్య హెచ్చుగా ఉన్నది. తను రాత్రింబవళ్ళు ఎంత కష్టపడి పనిచేసినా ఏదో వెలితి. చేయవలసినంత సేవ చేయటం లేదనిపిస్తుంది.

అన్యజనులలో మొదట కొర్నేలి కుటుంబానికి సున్నతి లేకుండానే బాప్తిస్మం ఇచ్చి సంఘంలో చేర్చుకొనుట ప్రారంభించనది కేఫా అయినను, దమస్కులో సాక్షిగా నిలచినది సౌలు మాత్రమే. బహు భాషా ప్రావీణ్యతమున యెరూష లేములో గ్రీకు మాట్లాడు యూదులలో తర్కించటం, సౌలు పరబాషా ప్రావీణ్యత ఎంతోమందిని ముగ్దులను చేసింది. ఎంతమంది మనయేసులైన, సిమెయోనులైన సౌలుతో సమా నులు కారు. తూర్పు పట్టణం వెళ్ళటం ఏమంత కష్టమైన పనికాదు. తూర్సు, అంతియొకయ ఈ రెండు వ్యాపారంలో ఒకదానితో ఒకటి పోటీ పడుతుంటాయి. అంతేకాక ఈ రెండు పట్టణాలు రోమీయుల సైనిక స్థావరాలు అయినందున ప్రతిరోజు ఉదయ సాయంకాలాలు ప్రయాణీకులకై సెలూకయ నుండి తార్సునకు, తార్సు నుండి సెలూకయకు అతి విలాస వంతమైన ఓడలు అతి వేగంగా ప్రయాణిస్తుంటాయి.

సౌలును అంతియొకయలో సేవకొరకు ఆహ్వానించటం యెరోషలేములోని మూల స్ధంభాలైన యాకోబు, యెహాను, పేతురులకు సమ్మతమో, కాదో అని కొంత ఆలోచించవల సింది. ఏది ఏమైనా సౌలు కొరకు తన హృదయ తీవ్రతనుబట్టి ఇది దైవ ప్రేరేపితమే అని నమ్మకం కుదిరింది బర్నాబాకి.

ఉదయం పదిగంటలకు తార్సు బయలుదేరిన ఓడ గాలి వాటు వలన వందమైళ్ళ ప్రయాణం నాలుగు గంటలలోనే ముగిసింది. తార్సు రేవు వచ్చే కొలది తీరమునకు ముప్పై మైళ్ళ దూరాన ఉన్న తార్సు కొండలు పెద్దవిగా కనబడ సాగినవి. కొండల శిఖరాలు తెల్లగా మంచుతో కప్పబడి ఉన్నాయి.

ఈ ఓడరేవు అందమంతా, దానిని ఆనుకొని ఉన్న సిడ్నినది ముఖద్వారమే. తన ప్రయాణం కొరకు బర్నబా ప్రత్యేకమైన దుస్తులేమి తీసుకొని రాలేదు. ఓడ రేవులో అడుగు పెట్టగానే యాత్రికుల కోసం వేచియుండే బోయీలు చుట్టు ముట్టారు. బర్నబా వాళ్ళందరిని తప్పించుకొని ప్రక్కగా చెట్టుక్రింద రాతి అరుగు మీద కూర్చున్నాడు. కొంచంసేపు బాడుగ కొర్రకై ఎదురు చూచిన వారందరు బర్నబా విషయంలో నిరాశ చెంది వెళ్ళి పోయారు.

ఒక గుఱ్ఱపు బగ్గీ మాత్రము నిలబడిపోయింది. దాని చోదకుడు మాత్రం కనిపించలేదు. తను ఇప్పుడు ఏ వైపు వెళ్ళాలి, ప్రతి పట్టణంలోను యూదులందరు ఒకే ప్రదేశంలో ఉంటారు. వారున్నచోట ఖచ్చితముగా సమాజ మందిరము వుంటుంది. వారిలో ఎక్కువమంది వ్యాపారస్తులే. తార్సు

పట్టణం ఎటు చూసిన సంపన్నమైనదిగా కనబడుతుంది. తను ప్రయాణం చేసి వచ్చిన విలాసవంతమైన ఓడ తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతుంది. తన వెనుక ఎవరో కూర్చున్న శబ్దం విని వెనుకకు తిరిగి చూశాడు. దాదాపు తన తండ్రి వయస్సు, వయస్సు పెద్దదైనా శరీరం చాలా ధృడమైనదిగా కనబడుతున్నది. బర్నబా పలకరింపుగా అతని వైపు చూశాడు. అందుకోసమే వేచిఉన్నట్లు అతను కొంచెం దగ్గి "పట్టణం లోనికి వస్తారా?" అన్నాడు దగ్గరగా వచ్చికూర్చుంటూ.

"మీరు వెళ్తున్నారా?" అన్నాడు బర్నబా.

"ఆ గుఱ్ఱపు బగ్గీ నాదే" అన్నాడు.

"అది బాడుగకు వచ్చేదా. ఎవరో ధనవంతుని గృహ అవసరముల కొరకై వాడబడుతున్నది అనుకొన్నాను" అన్నాడు ఆశ్చర్యంగా బర్నబా.

"ఇది బాడుగ బండైనా సరుకులు మాత్రం తీసికోను, ప్రయాణీకుల కొరకు ఎవరిని పంపిస్తే వారే నా బండి దగ్గరకు వస్తారు"అని అంటున్నప్పుడు అతని మాటలలోని నిశ్చయత బర్నబాని కొంచెం ఆలోచింపచేశాయి.

"ఇంతకీ మీరు ఏప్రాంతం వారు" అన్నాడు.

"పాలస్తీనా, నాస్నేహితుడు తార్సువాడైన సౌలు కొరకు వచ్చాడు యూదుడు" అని అతని ముఖంలోకి చూశాడు. ప్రపంచంలో ఏజాతి అయినా ఇంతటి సంచలనం సృష్టించ లేదు. యూదుడు అనగానే అతని ముఖం ఏ విధంగా మారుతుందో చూడాలని అనుకున్నాడు. బర్నబా ఆశ్చర్య పోయేటంతగా అతని ముఖం మారిపోయింది.

"షెమయ" అంటూ అతనిని పరిచయం చేసికొన్నాడు. దేవుని దయవలన దేవుడు పంపించిన వ్యక్తి ఈ షెమయ యూదుడు అనుకొని లేచి సంతోషంతో ఆలింగనం చేసికొని ఇద్దరూ చిరకాల మిత్రులుగా మారిపోయారు.

"బెన్యామీనీయుడైన సౌలు దొరకటం కష్టమే" అన్నాడు షెమయ.

"మీకు బాగా తెలుసుననుకుంటాను" అన్నాడు బర్నబా.

"చిన్నతనం నుండి అతనెక్కువగా యెరూషలేములోనే గడిపాడు, అతని ఆస్తి అతన్ని మా నుండి దూరం చేసింది. నా కుమారుని వయస్సు వాడే" అన్నాడు.

"మనం బయలుదేరుదామా?" అన్నాడు బర్నబా.

బండి బయలుదేరింది, ఎదురుగా రహదారి మీద పడిన సూర్య కిరణాలు సూటిగా బర్నబా కళ్ళల్లో ప్రతిబింబించాయి.

"ఔను, ఇది ఖచ్చితంగా పాలరాతి బాటే" అనుకుంటు న్నట్లు పెద్దగా అన్నాడు. తాను ఇంతకు ముందు విన్నాడే కాని ఇదే మొదటిసారి ఇటువంటి బాట మీద ప్రయాణం చేయటం. సంతోషం ఉరకలు వేసింది. కొంచెం సర్దుకొని కూర్చున్నాడు.

"ఈ పాలరాతి బాటవేసి ఎన్ని సంవత్సరాలు అయింది" అన్నాడు కొంచెం పెద్ద స్వరంతో షెమయవైపు చూస్తూ.

"అప్పుడు నేను చాలా చిన్నవాడిని. యుద్ధంలో పాంపేని తరుముకుంటూ జూలియస్ సీజరు కిలికియలోని తార్సు పట్టణం వచ్చినప్పుడు, తార్సు ప్రజలు ఆయనకు అన్ని విధాల సహాయం చేశారు. జూలియస్ సీజరు చేయబడిన తర్వాత జరిగిన యుద్ధంలో యాంటనీ గెలుపొందాడు. కాషియస్‌కి యుద్ధంలో సహాయం చేసిన ఈజిప్టు దేశపురాణి క్లియోపాత్రని శిక్షించటానికి మార్కుయాంటనీ తార్సు పట్టణానికి వచ్చిన పుడు ఆయన గౌరవార్ధం ఈ ముఖ్యమైన బాటని చలువ రాళ్ళతో వేశారు. అప్పుడు మార్కుయాంటనీ సంతోషించి ఈ తార్సు పట్టణానికి రోమా పౌరసత్వము కలిగించాడు" అన్నాడు.

"మార్కుయాంటనీ ఈ పట్టణంలో ఎంతకాలం గడిపాడు" అన్నాడు బర్నాబా.

"అది నాకు తెలియదు. అప్పుడు నేను చాలా చిన్నవాడిని. అదిగో..." అంటూ తన చేయి చూపిస్తూ "ఆ దేవాలయం ఎదురుగా ఉన్న పెద్ద అరుగు మీద, ఆయన సింహాసనం మీద కూర్చుని ఇప్పుడో, ఇంకొంచెంసేపటికో క్లియోపాత్ర రేవులో ప్రవేశిస్తుందని చూస్తున్నాడు మార్కుయాంటనీ. అతన్ని చూడవచ్చిన జనమంతా ఈ వీధులన్ని నిండి ఉన్నారు. కొంచెంసేపటికి తన చుట్టూ ఉన్న ప్రేక్షకులైన ప్రజలందరు తరిగిపోవటం యాంటనీ గమనించాడు. మరికొంచెంసేపటికి ముఖ్యులైన సైనికాధికారులు తప్ప ప్రజలందరు మాయమై

పోయారు. ఐగుప్తురాణి ప్రయాణం చేస్తున్న ఓడరేవులో ప్రవేశించిందని యాంటనీకి అప్పుడు అర్థమైంది. తన బలం, పౌరుషం కంటే క్లియోపాత్ర అందం, రాజనీతి గొప్పదని. తనని శిక్షించటానికి వచ్చిన యాంటనీని తనే జయించింది" అని ముగించాడు షెమయ.

బండి సౌలు ఇంటి ముందు ఆగింది. బర్నబా బండి దిగాడు. బండి ముందుకు వచ్చి "షెమయ మిమ్ములను మరలా ఎక్కడ కలుసుకోగలను" అన్నాడు.

"సౌలు మీకు అంత తొందరగా దొరకక పోవచ్చును. ఆయన ఎప్పుడూ ఇతర గ్రామాలలో క్రీస్తు సువార్త ప్రకటి స్తుంటారు. ఈ బాట నేరుగా వస్తే ఈ బగ్గీ మా యింటి ముందు ఉంటుంది. అక్కడ లేకపోతే రిగ్మా సరస్సు దగ్గర" అంటూ బర్నబా ఇచ్చిన పైకం తీసికొని బండి కదిలించాడు.

చుట్టూ ఎత్తైన ప్రహరి, లోపల అనేక గృహాలు, ప్రవేశ ద్వారము చాలా పెద్దది బలమైనది.

కాపలా అతను "ఎవరు కావాలి?" అన్నాడు.

"సౌలుగారు" అన్నాడు.

"తెలియదండీ, అసలు ఎప్పుడు వచ్చేది ఆయనకు కూడా తెలియదు, ఎప్పుడు పట్టణాలు, గ్రామాలు తిరుగుతుంటారు. వారి తండ్రి చనిపోయిన తరువాత అమ్మగారే అన్ని చూస్తుం టారు. అమ్మగారిని చూసేపనైతే ఇలా వెళ్ళండి" అంటూ దూరంగా ఉన్న రెండంతస్తుల బంగళా చూపించాడు.

బర్నబా నిట్టూర్చాడు. మొత్తానికి సౌలు జాడ కొంచెం అయినా తెలిసింది. ఇక సౌలు తిరిగి వచ్చే వరకు వేచి యుండాలి. అనుకుంటూ ఆ ఇంటికి వెళ్ళాడు. పనివాడు లోపలికి వెళ్ళి సౌలు భార్యని పిలుచుకొని వచ్చాడు. యెరూష లేములో కాపురమున్న సౌలు సహోదరి, మేనల్లుడు కూడా తెలుసునని, తను కూడా సౌలువలె యేసును క్రీస్తుగా అంగీకరించి ఆయన సేవలో ఉన్నానని చెప్పాడు.

సౌలు భార్య మీరా, వయస్సుకు మించిన బాధ్యతలు భరిస్తున్న చారలు ముఖం మీద కనిపించాయి. సౌలు విషయంలో ఆమె నిరాశ చెందినట్లుగా కనిపించింది.

"ఆయన దర్బె, మోరి, ఆరని, బోయ, లుస్త్ర పట్టణాలలో యేసుని ప్రకటించి, అక్కడనుండి ఇల్లూరికి వెళతానని నెలక్రితం బయలుదేరాడు. రెండు, మూడు రోజులలో తిరిగి వస్తారు. అప్పటిదాకా విశ్రాంతి మందిరంలో ఉండండి " అని పని వానిని పిలిచి అతనికి బర్నబా బాధ్యతలు అప్పగించింది.

ఎన్నో ఆశయాలతో, కోర్కెలతో ప్రారంబించిన కుటుంబం జీవితం కుటుంబ యజమాని మూర్ఖత వలన ఫలించలేద న్నట్లుగా ఇంత ఆస్తి ఉన్నా దానిని వినియోగించుకొనే నాధుడు లేనట్లుగా ఆమె మాట్లాడటం, చిన్నప్పుడు తనను గురించి కూడా తన కుటుంబ సభ్యులు అలానే ఆలోచించిన సంగతి జ్ఞాపకము వచ్చింది. తన బసలో అన్ని సౌకర్యాలు ఉన్నవి. పై అంతస్తులో గది, ఉత్తరం వైపు చూస్తే మధ్యధరా సముద్రం, ఓడరేవు, సరుకులు ఎత్తుకుంటున్న ఓడలు, కొన్ని సరుకులు దిగుమతి చేస్తున్నవి. తూర్పున షెమయగారి ఇంటి ముందున్న గుఱ్ఱపు బగ్గీ. దానికి కొంచెందూరంలో తూర్పు వైపునే సూర్య కాంతికి మెరసిపోతున్న పెద్ద సమాధి. ఎవరో ఈ పట్టణపు రాజుదై ఉంటుంది అనుకున్నాడు.

సాయంకాలం షెమయగారి జనం బర్నబా వైపు తేరి చూడనారంభించారు. కారణం, ఇంత ఎత్తైన మనుష్యులు ఇక్కడ అరుదు. షెమయ రూబేనీయుడు, ఇప్పటికి నాలుగు వందల సంవత్సరాల క్రితం అలెగ్జాండరు దండయాత్రలో యెరుషలేము నుండి వలస వచ్చిన వారిలో వీరి పూర్వీకులు ఉన్నారు.

సౌలు కొరకు దూర గ్రామాలు పెద్ద పట్టణాలు తిరగటం కంటే దగ్గర దగ్గర కొద్ది దూరంలో ఉన్న గ్రామాలలో వెదకటం మంచిదని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. మరునాడు ఉదయాన్నే బగ్గీలో దర్బే వైపుగా ఉన్న గ్రామాలలో వెదక బయలుదేరారు. తార్సు పట్టణం వెలుపలికి వచ్చి ఉత్తరం వైపుగా తిరగగానే ఒంటెల సముదాయం "కిలికియ ద్వారము" అనబడే తార్సు కొండల కనుమలలో ప్రవేశిస్తున్నాయి. ఆ సమయంలో తార్సు సూర్యుడు ప్రశాంతంగా, చల్లగా అనిపించాడు. బగ్గీ ఆ కనుమలలో ప్రవేశించినప్పుడు బర్నబా బగ్గీ దిగి నడవడం ప్రారంభించాడు. తలెత్తి పైకిచూస్తే బారులు తీరి ప్రయాణం

చేసే స్టాయిక్ పక్షులు కనిపించాయి. ఇవి సిరియా నుండి ఆసియా మైనరులోని ఎఫెసు పట్టణంలో ఉన్న ప్రపంచంలోని ఏడు వింతలలో ఒకటైన అర్తెమి మహాదేవి దర్శనార్థం వెళ్తున్న యాత్రికుల సముదాయంతో కనిపించాయి.

"ప్రతి వసంత ఋతువులోను ఈ పక్షులు ఇలా ప్రయాణం చేస్తాయి" అన్నాడు షెమయ. సౌలు బాల్యమంతా ఇలాగే గడిచి యుండవచ్చును అనుకొంటూ బండి ఎక్కాడు . అరగంట ప్రయాణం తర్వాత షెమయ...

"ఈ తార్సు కొండలు ఎనిమిది మైళ్ళ పొడవు, అందువలన వంద అడుగుల సొరంగం త్రవ్వి యూరపును ఆసియాను కలిపారు. ఈ దారి ద్వారానే సుమారు ఐదువందల సంవత్సరాల క్రితం కోరేషు రాజు పదివేలమంది సైనికులతో బబులోను వైపు దండయాత్ర సాగించి నెబుకద్నెజరు మనుమడైన బెల్షస్సరును" అని అంటుంటే....

ఈ బాట ద్వారానే నడచి నాలుగువందల సంవత్సరాల క్రితం అలెగ్జాండరు పారిపోతున్న పర్షియా సైనికులను జయించాడు. ఈ కనుమలు ప్రపంచ గవిని అని విన్నాను, ఇప్పుడు సౌలును వెదకడం వలన చూడగలిగాను" అన్నాడు బర్నబా. ఆ కనుమలలో నుండి బయటకు వచ్చిన తర్వాత బగ్గీని ఆపమని బండిదిగి ఒక రాతి బండ మీద చెక్కబడిన అలెగ్జాండరు దండయాత్ర వివరాలు పెద్దగా చదివాడు. షెమయ బర్నబాను చూస్తూ తన కుడిచెయ్యి గడ్డం క్రింద ఆనించి ఆలోచిస్తున్నాడు.

బర్నబా అతని దగ్గరగా వచ్చి, చేయి చాపి– ఈ సొరంగ మార్గం ద్వారా చక్రవర్తులు, వీరులు ప్రయాణం చేసి మరణించారు. కాని ఇప్పుడు మరణమును జయించి లేచిన రాజాధి రాజు యొక్క సేవకుడైన సౌలు తన సువార్త దండ యాత్రను ఇక్కడనుండి ప్రారంభించాడు" అన్నాడు.

ఇప్పుడిప్పుడే బర్నబా రాకను అర్థం చేసికొంటున్న షెమయకు యేసు నామము కొరకై సౌలు ఈ పది సంవత్సరాలలో చేసిన ప్రయాణాలలోని అంతరార్థం అర్థమవటం మొదలుపెట్టింది.

నాలుగు రోజులు అలా చుట్టు ప్రక్కల చిన్న చిన్న గ్రామాలలో వెదకి చివరికి ఒకరోజు బర్నబా నిద్రపోతుంటే ఉదయాన్నే సౌలు నిద్ర లేపాడు.

ఉదయాన్నే నిద్రలేస్తూనే సౌలు ముఖం చూసిన బర్నబా ముందు ఇది కల కాదు కదా అనుకున్నాడు. తరువాత ప్రశాంతమైన ముఖంలోని దయగల కళ్ళను చూసి ఒక్కక్షణం ప్రభువు అనుకుని వెంటనే లేచి నిలుచున్నాడు. సౌలును గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. కొంచెంసేపు యోగక్షేమాలు అడిగిన తరువాత అంతియొకయలోని సేవను గురించి బర్నబా చెప్పనారంభించినప్పుడు సౌలు కళ్ళనిండా నీరు నిలిచింది. చెప్పడం ఆపి బర్నబా సౌలు భుజం మీద చేయివేసి ఎందుకన్నట్లు చూశాడు. సౌలు కళ్ళు ఆర్పినప్పుడు కన్నీరు చెంపల మీదుగా కారి గడ్డం తడిపి రొమ్ము మీదుగా అంగీలో ఇంకిపోయినవి. సౌలు ముఖం ప్రశాంతంగా వెలుగుతుంది.

"ఈ పది సంవత్సరాలు విశ్వాసానికి పరీక్ష. మానసిక శోధన, ప్రభువును శోధించదలచుకోలేదు. నన్ను పిలిచిన వాడు నమ్మదగిన వాడని నేనే నిరూపించాలని అనుకున్నాను. ఒకరి విశ్వాసం మీద కాదు, నా ప్రభువునందు నా విశ్వాసాన్ని నేనే పరీక్ష చేసుకున్నాను. ఇది ప్రస్తుతం ఆయన చిత్తమే" అన్నాడు.

"ప్రస్తుతం ఆయన చిత్తమేమిటి?" అన్నాడు బర్నబా.

"అవును! మన జీవితాలను ఆయన ఏ కార్యం కొరకు ఏర్పాటు చేసుకున్నాడో అది తెలుసుకోవడం మన పని కాదు. ఈ రోజు అంతియొకయ సేవ, రేపు ఎక్కడ?" అని ముగించాడు.


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**

సీరియల్

# ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ దేవుడున్నాడు 27

## (లియో టాల్‌స్టాయ్)

"నేను అలా కనిపిస్తున్నానా?" అని, "నేను నీకు చెప్పడానికి సిగ్గుగా అనిపిస్తుంది. కాని రాత్రి నేను ఓ స్వరము విన్నట్లుగా అనిపించింది. అది కలో నిజమో తెలియదు కాని యేసుప్రభువు నా ఇంటికి వస్తున్నట్లుగా వినిపించింది. రాత్రి నేను ఆయన సువార్త చదువుతున్నాను. ఆయన ఈ లోకంలో నడిచాడు. మాట్లాడాడు. ఆయన మన కోసం ఎన్ని కష్టాలు పడ్డాడో నీ వెరుగుదువా?" అన్నాడు.

"నేను చదువులేనివాడ్ని అయినా యేసును గురించి విన్నాను" అన్నాడు స్టెపెంటా.

"యేసును ఓ పరిసయ్యుడు తన ఇంటికి ఆహ్వానించాడు. కాని ఆయనకు సరిపోయే గౌరవం ఇవ్వలేదని చదివాను. ఒకవేళ యేసు నా ఇంటికి వస్తే నేనెలా ఆయనను గౌరవిస్తాను? అనుకుంటూ నిద్రపోయాను. రేపు నేను నీ ఇంటికి వస్తాను అనే స్వరము విని నేను నిజంగా ఆయన కొరకు ఉదయం నుండి కనిపెడుతున్నాను" అన్నాడు మార్టిన్.

స్టెపెంటా తల ఊపి – "నిజమే" అన్నాడు.

"ఆయన నిజంగా ఈ భూమి మీద నడిచాడు. ఆయన సామాన్య మానవుడుగా సామాన్యులతో కలిసి తిరిగాడు. కష్టించి పనిచేసేవారిని తన శిష్యులుగా స్వీకరించాడు. తనకు తానుగా హెచ్చించుకొనువాడు తగ్గించబడును. తనకు తాను తగ్గించుకొనువాడు హెచ్చించబడును అని అన్నాడు. అందరి కంటే ముందుగా ఉండాలనుకునేవాడు అందరికి పరిచారకుడిగా ఉండాలి అన్నాడు. తగ్గించబడినవాడు, ఆకలిగొనినవారు, బీదలు ధన్యులు" అని అన్నాడు మార్టిన్.

స్టెపెంటా అలా కూర్చునే కండ్ల వెంబడి నీరు కారుస్తు లేచి నిలబడి "ఇక నేను వెళ్తాను. ప్రభువు నిన్ను దీవించును గాక. నీవు నా శరీరానికి మనసుకు కూడా ఆహారం ఇచ్చావు" అన్నాడు.

"మరలా మీ కిష్టమైనపుడు రండి" అన్నాడు మార్టిన్. స్టెపెంటా వెళ్ళిపోయిన తర్వాత మార్టిన్ సామాను సర్ది వెళ్ళి కిటికి ప్రక్కన కూర్చుని తన పనిలో మునిగిపోయి యేసు ప్రభువు రాకకొరకు కిటికి వైపు మాటిమాటికి చూస్తున్నాడు. అతని మనస్సంతా సువార్తలలోని యేసు మాటలతో నిండి వున్నది.

సైనికులు గుఱ్ఱాల మీద వెళ్ళారు. తర్వాత కొందరు సైనికులు మంచి బూట్లు వేసుకొని కవాతు చేస్తూ వెళ్ళారు. ఆపిల్ కాయలు అమ్మే అతను అరుస్తూ, అమ్ముకుంటూ వెళ్ళాడు. తర్వాత ఓ నడికారు స్త్రీ కిటికి ప్రక్కగా నిలుచుండి ఉండడం చూచాడు. ఆమె ఒక చేత్తో చిన్నబిడ్డను రొమ్ముకు ఆనించుకున్నది. నిలువలేక, వీపు గోడకు ఆనించి జారి పోతున్న పసిబిడ్డను ఒక చేత్తో పైకి ఎత్తాలని ప్రయత్నిస్తుంది కాని ఆమెకు అందుకు శక్తి చాలలేదు. ఆమె వేసుకున్న దుస్తులు ఈ మంచుకు ఆమెను కాపాడలేవు. మార్టిన్ లేచి తలుపు తీసి బయటకు వచ్చాడు. "అమ్మా అమ్మాయి! ఇటు చూడు" అన్నాడు.

ఆ అమ్మాయి మార్టిన్ వైపు చూచింది.

"అమ్మా అక్కడ చలిలో నీవు నీ చిన్న పాపను ఈ చలికి కప్పలేవు. లోపలికి రా!" అన్నాడు.

ఆ అమ్మాయి ముక్కు మీదకు జారిన కండ్లద్దాలు పెట్టుకొని చేతిలో దుప్పటి లాంటిది పట్టుకొని పలకరించిన మార్టిన్‌ను చూసి ఆశ్చర్యపోయి తులుపువద్దకు వచ్చింది.

లోనికి వచ్చిన తర్వాత "ఆ మంచము మీద కూర్చోమ్మా!" అన్నాడు.

"అమ్మా! ఆ మంట దగ్గర చలికాచుకో బిడ్డకు పాలివ్వు" అన్నాడు. "అయ్యా! ఉదయం నుండి నేనేమీ తినలేదు. అందువలన నా దగ్గర బిడ్డకు పాలులేవు" అంటూ బిడ్డను తన రొమ్ముకు ఆనించుకున్నది. అప్పుడు మార్టిన్ యేసుకొరకు వండుతున్న సూపు కొంచెం రొట్టె ఆమెకు ఇచ్చాడు.

"అమ్మ! ఇవి తిను, బిడ్డను నేను చూస్తాను. నాకు కూడా ఇంత పిల్లలు ఉండిరి" అంటూ ఆ బిడ్డ దగ్గర కూర్చున్నాడు.

ఆమె బల్ల దగ్గర కూర్చుని రొట్టె తింటూ ఉంటే మార్టిన్ మంచం మీద పండుకున్న పిల్లతో మాట్లాడుతూ తన వ్రేలితో బిడ్డను తడుముతూ ఉంటే బిడ్డ ఏడుపు ఆపింది. తర్వాత మార్టిన్ ఆ నెలల బిడ్డతో మాట్లాడుతుంటే ఆ బిడ్డ నవ్వింది. ఆమె తినడం ముగించి "నేను ఓ సైనికుడి భార్యను. ఎనిమిది నెలల క్రితం ఆయనను ఎక్కడికో పంపించారు. అప్పటినుండి ఆయన సంగతి నాకేమి తెలియదు. మూడునెలలు ఒక ఇంట్లో పనిచేశాను. ఈ బిడ్డపుట్టిన తర్వాత వారు నన్ను పనిలో ఉంచలేదు. కొంతకాలము నాకున్న వస్తువులన్ని అమ్ము కుంటూ జీవించాను. నేనెక్కడికైనా పనికి వెళ్తే చాలా బల హీనంగా ఉన్నానని పని ఇవ్వడం లేదు. మా ఊరి నుండి వచ్చిన ఒకామె పని చూపిస్తాను రమ్మన్నది. వెళ్ళాను. కాని ఓ వారం ఆగి మళ్ళీ రమ్మన్నది. మా అద్దె ఇంటి యజమాని అద్దె లేకుండా ఇంట్లో ఉండమన్నాడు. ఇప్పుడు బిడ్డ ఆకలికి అల్లాడుతున్నాడు" అని చెప్పింది.

"నీకు ఇంకా చలి నుండి తప్పించే గుడ్డలు ఏమీ లేవా?" అన్నాడు. "నాకు ఆ గుడ్డలు ఎలా వస్తాయి? చలికి తప్పించే పరదా ఆరు పెన్నిలకు కుదువపెట్టాను" అన్నది.

మార్టిన్ లేచి గోడకు తగిలించి ఉన్న చలి టోపిని తీసి ఆమెకు ఇస్తూ "ఇది చాలా పాతదే! అయినా పని గడుపు తుంది" అని ఆమెకు ఇచ్చాడు. తర్వాత మంచం మీద దుప్పటి క్రింద నుండి ఆరు పెన్నిలు తీసి ఆమె చేతికిస్తూ "ఈ డబ్బు తీసుకొని నువ్వు కుదువపెట్టిన చలికోటు విడిపించుకో" అన్నాడు. ఆ డబ్బులు చేతిలోనికి తీసుకున్న ఆ అమ్మాయి ఏడుస్తూ "దేవుడు నిన్ను దీవించునుగాక, నన్ను నీ గది కిటికి వద్దకు ఆయనే పంపియుంటారు. లేకుంటే ఈ పాటికి నా బిడ్డ ఈ చలికి గడ్డకట్టిపోయేది. నేను బయలుదేరినపుడు ఇంత చలిలేదు. కాని ఇప్పుడు ఈ చలి ఎముకలను కొరికి వేస్తుంది" అన్నది. "ఖచ్చితంగా ఆ యేసయ్య నిన్ను కిటికీలో నుండి నన్ను చూసేటట్లుగా చేశాడు" అన్నది.

మార్టిన్ నవ్వాడు. "ఇది నిజమే! యేసయ్యే నన్ను నీ వైపు చూచేటట్లు చేశాడు" అని చెప్పి రాత్రి తను నిద్రలో వినిన మాటలు ఆమెతో చెబుతూ "రాత్రి దేవుడు నన్ను దర్శిస్తాను అని చెప్పాడు" అన్నాడు.

ఆ స్త్రీ లేచి నిలుచుని మార్టిన్ ఇచ్చిన గుడ్డ తనకు బిడ్డకు కలిపి చుట్టుకుని "అయ్యా! వెళ్ళివస్తాను" అన్నది.

ఆమె కొరకు తలుపుతీసి ఆమె వెళ్ళిన తర్వాత తలుపు మూసి సామాను సర్ది మరలా కిటికి వద్ద కూర్చుని చెప్పులు కుట్టసాగాడు. అయితే యేసుకొరకు ఎదురుచూస్తూ కిటికి వైపు చూస్తూ ఉన్నాడు. మధ్యమధ్యలో జనం కిటికి ప్రక్కగా అటు ఇటు కొందరు తెలిసినవారు, కొందరు తెలియనివారు వెళ్తుంటే వారిని చూస్తున్నాడు.

తర్వాత ఓ ముసలామె తలమీద బుట్టలో నాలుగు ఆపిల్ కాయలు ఉన్నాయి. భుజము మీద కర్రముక్కలు గోనె సంచిలో వేసుకున్నది. ఆమె గుడ్డలు చినిగిపోయాయి. తన శరీరమంతా కప్పలేవు. వేసుకున్న బూట్లు చాలాపాతవి. అరిగిపోయినవి. అక్కడ నిలుచుండి గంప ఓ దిమ్మెమీద పెట్టి తను ఏరుకున్న చెక్క ముక్కలు సంచిలో సరిగా పోసుకొని ఓ భుజము మీద పెట్టుకొంటుంటే పన్నెండు సంవత్సరాల బాలుడు అటుగా వెళ్తూ బుట్టలో ఉన్న ఆపిల్‌కాయను తీసుకొని పరుగెత్త బోయాడు. కాని ఆ ముసలామె చెయ్యిచాపి ఆ పిల్లవాడి చొక్కా పట్టుకున్నది. ఆ పిల్లవాడు తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా ఆమె వదలలేదు. పెద్దగా ఆ పిల్లవాడ్ని తిడుతూ కొట్టబోయింది. ఇక ఆమెకు దొరికిపోయానని గ్రహించి ఆ పిల్లవాడు ఆమెతో వాదనకు దిగాడు.

ఇదంతా చూసిన మార్టిన్ లేచి తలుపు తీసుకొని తన చేతిలోని సూదిని ప్రక్కన చెప్పుకు గుచ్చి గబగబ బయటకు వస్తు మెట్లవద్ద తూలి పడబోయాడు. అతని కండ్ల అద్దాలు మెట్లమీద పడిపోయాయి. అయినా లెక్క చెయ్యకుండా ఆ స్త్రీ వద్దకు వచ్చేటప్పటికి ఆమె ఆ పిల్లవాడి తలమీద టోపీ నెట్టివేసి వాని తలవెంట్రుకలు గట్టిగా పట్టుకున్నది.

"నేను నీ కాయ తీసుకోలేదు. నన్నెందుకు కొడుతున్నావు?" అని ఆ పిల్లవాడు అరుస్తున్నాడు.

మార్టిన్ వారిద్దరిని విడదీసి "వాడ్ని పోనివ్వు, వాడ్ని దేవునిపేర క్షమించు" అన్నాడు.

"వీడు మరలా ఇటువంటి పని చెయ్యకుండా వీడ్ని శిక్షించి పోలీసులకు అప్పజెపుతాను" అన్నది ఆమె రొప్పుతూ.

"వాడ్ని పోనియ్యమ్మ చిన్నపిల్లవాడు. దేవుని పేరు మీద వాడ్ని క్షమించు" అని మార్టిన్ అంటే ఆమె వాడ్ని వదిలింది. మార్టిన్ వాడిని పట్టుకొని "అమ్మకి క్షమాపణ చెప్పు. మరలా

ఇటువంటి పనులు చెయ్యకు" అన్నాడు.

ఆ పిల్లవాడు ఏడుస్తూ క్షమాపణ అడిగాడు.

"మంచిది. ఇదిగో ఆపిల్‌కాయ" అని ఆమె బుట్టలోనుండి కాయ తీసి ఆ పిల్లవానికిచ్చి "అమ్మా! ఈ పండుకు డబ్బులు నేనిస్తాను" అన్నాడు.

"వీన్ని ఇలా వదలకూడదయ్యా! వాడు చేసిన పనికి కొరడాతో కొడితే కాని మరలా ఇటువంటి పనిచెయ్యకుండా ఉండడు" అన్నది.

"అయ్యో అమ్మా! వాడు చేసిన పనికి వాడ్ని కొరడాతో కొడితే మనం చేసిన పాపాలకు మనం ఎన్ని దెబ్బలు తినాలి?" అన్నాడు మార్టిన్. ఆమె మౌనంగా నిలుచున్నది.

"ఒక రాజుకి ఒకడు పదివేలు చెల్లించవలసియున్నది. అయితే తను రాజును బ్రతిమాలుకున్నందున అతని అప్పు క్షమించాడు. కాని ఇతను తనకు నూరు రూపాయలు బాకీ ఉన్నవాని దగ్గరకు పోయి నా డబ్బు చెల్లించు అని అతని మెడపట్టుకొని చెరసాలలో వేయించాడు. రాజు ఆ సంగతి తెలిసి తప్పుచేసినవాడిని కఠినంగా శిక్షించాడు.

దేవుడు మన తప్పులు క్షమించాడు. కనుక మనం కూడా ఇతరులను క్షమించాలి" అన్నాడు.

ఆ స్త్రీ తల ఊపుతూ బుట్టను తలమీద పెట్టుకుంటూ "నిజమే! కాని ఈ తరం పిల్లలు బొత్తిగా చెడిపోతున్నారు" అన్నది.

"నిజమే! పెద్దవారే వారికి మంచి దారి చూపించాలి" అన్నాడు. "అదేనయ్యా నేను చెప్పేది. నాకు తొమ్మిదిమంది పిల్లలు కానీ ఒక్క కుమార్తె మిగిలింది. తర్వాత ఆమె కథ చెప్పడం మొదలుపెట్టింది. కుమార్తెకు పెండ్లి చేశాను. మనుమలు ఉన్నారు. వారికోసమే నేను కష్టపడుతున్నాను. ఆ పిల్లలంటే నాకు చాలా ప్రేమ. ఆఖరిది ఆనీ నన్ను ఎప్పుడు వదలకుండా ఉంటుంది" అని చెప్పేటప్పటికి ఆమె చాలా మెత్తబడి పోయింది.

తన కట్టెల సంచి తలమీద పెట్టుకోవడానికి కదిలింది. కాని ఆ పిల్లవాడు గబుక్కున ముందుకు వచ్చి "అమ్మా! నేను కూడా ఇటే వెళ్తున్నాను. ఆ మూట నా తలమీద పెట్టు" అన్నాడు.

ఆమె తలఊపి ఆ మూట ఆ పిల్లవాని తలమీద పెట్టింది. ఇద్దరూ కలిసి అటుగా బయలుదేరి వెళ్ళిపోయారు.

వారిద్దరు అలా మాట్లాడుకుంటూ వెళ్తుంటే మార్టిన్ వారిద్దరిని చూస్తూ ఇంటిలోనికి వెళ్ళ బయలుదేరాడు. తన కళ్ళద్దాలు పగిలిపోకుండ మెట్లమీద ఉన్నవి తీసుకొని లోనికి వచ్చి పనిచేయసాగాడు. చీకటి పడుతుంది అని గ్రహించి, లేచి దీపము ముట్టించాడు. కూర్చుని క్రొత్తనిబంధన చదవాలని నిన్న చదవటం ఆపినచోట తెరిచాడు. కాని మరియొక చోట తెరుచుకున్నది. వెంటనే రాత్రి జరిగిన సంగతులు జ్ఞాపకము వచ్చాయి. రాత్రి కల. ఇంతలో తన ఇంట్లో మనుష్యులు నడుస్తున్న అలికిడి వినబడింది. మార్టిన్ తల త్రిప్పిచూశాడు. ఎవరూ కనిపించలేదు. కాని ఆ మూల చీకట్లో కొందరు నిలుచున్నట్లు అనిపించింది.

"అక్కడ ఏమిటి?" అని, "అక్కడ ఎవరు?" అన్నాడు మార్టిన్.

"మార్టిన్! మార్టిన్! నన్నెరుగవా?" అనే స్వరము వినవచ్చింది. తర్వాత స్టెపెంటా, ఆ చీకట్లో నుండి వచ్చి నవ్వుతూ మాయమయ్యాడు. తర్వాత "ఇది నేనే" అని పసిబిడ్డతో ఉన్న ఆ యవ్వనస్త్రీ చీకటిలోనుండి బయటకు వచ్చి మాయమైపోయింది. మరలా "ఇది నేనే" అని ఆ వృద్ధ స్త్రీ ఆ బాలుడు చీకట్లో నుంచి బయటకు వచ్చి మాయమైపోయారు. ఇప్పుడు మార్టిన్ హృదయం సంతోషంతో నిండిపోయింది. మార్టిన్ కళ్ళద్దాలు తీసి పెట్టుకొని క్రొత్త నిబంధన తెరిచాడు. అక్కడ – 'నేను ఆకలిగొన్నప్పుడు మీరు నాకు అన్నం పెట్టారు. దాహం వేసినపుడు మీరు నాకు నీళ్ళిచ్చారు. పరదేశిగా మీదగ్గరకు వచ్చినపుడు నాకు ఆతిథ్యము ఇచ్చారు' అని చదివాడు. మరలా పేజి చివరిలో

'హీనస్థితిలో ఉన్న ఈ సోదరులకు మీరు చేశారు కనుక నాకు చేసినట్లుగానే పరిగణిస్తాను' మత్తయి 25:40.

**అప్పుడు రాత్రి తనకు వచ్చిన కల నెరవేరినట్లుగా మార్టిన్ గ్రహించాడు. రక్షకుడు నిజంగా మార్టిన్ వద్దకు వచ్చాడు. మార్టిన్ ఆయనను ఆహ్వానించాడు.**

# బైబిలు కథలు - ఆదాము, హవ్వ

పిల్లలూ బాగున్నారా? స్కూల్స్ తెరిచారు కదా! మరి సూల్లో పాఠాలు, హోంవర్క్, ఆటపాటలతో చాలా బిజీ ఉండి ఉంటారు కదా! మీలో ఎంతమంది ప్రతిరోజూ బైబిల్ చదువుకొని ప్రార్ధన చేసుకుంటున్నారు? మనం ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ బైబిల్ చదవటం, ప్రార్ధన చేసుకోవడం మర్చిపోకూడదు. దేవునికి లోబడి ఉండాలి. దేవుని ఆజ్ఞలు పాటించాలి. దేవుని ఆజ్ఞలు పాటించకపోతే ఆదాము, హవ్వ దేవునికి ఎలా దూరమయ్యారో మనం కూడా అలానే దూరమవుతాము. మరి ఆదాము, హవ్వలు దేవునికి ఎలా దూరమయ్యారో ఈ నెల కథలో తెలుసుకుందాము.




పోయిన నెల కథలో మనం ఏదెను తోటను గురించి తెలుసుకున్నాం కదా. ఆదాము, హవ్వలు తినడానికి ఆ ఏదెను తోటలో అనేక రకాలైన పండ్ల చెట్లు, కూరగాయల చెట్లు వేశాడు. వాటన్నిటిని నిరభ్యంతరంగా తినవచ్చని చెప్పాడు. ఆ తోట మధ్యలో రెండు ప్రత్యేకమైన చెట్లను వేశాడని చెప్పుకున్నాం కదా. ఆ చెట్లు ఏంటో మీకు గుర్తున్నాయా? ఒకటేమో జీవవృక్షఫలము చెట్టు, ఇంకొకటి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు కదా! అప్పుడు దేవుడు ఆదాము హవ్వలకు ఆ చెట్లను చూపించి, అందులో మంచి చెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తినవద్దనీ, ఆ చెట్టు ఫలము తింటే మీరు నిశ్చయముగా చనిపోతారని చెప్పాడు. ఆదాము హవ్వలు కూడా దేవుని మాటకి లోబడి ఆ చెట్టు ఫలముల జోలికి వెళ్ళరు.

అయితే దేవునికి, మనకి శత్రువైన వాడు ఎవరో మీకు తెలుసుగా. వాడే అబద్ధీకుడైన సాతాను. దేవుడు చేసే ప్రతి పనిని చెడగొట్టడం వాడి పని. మరి దేవుడు ఎంతో ఇష్టంగా తన స్వరూపములో, తన పోలికె చొప్పున చేసుకున్న ఆదామును, హవ్వను దేవునికి దూరం చెయ్యాలని కుట్ర చేశాడు. దేవుడు చేసిన భూజంతువులన్నిటిలో సర్పము యుక్తి గలదై ఉంది. అప్పుడు సాతాను సర్పము ద్వారా తోటలో ప్రవేశించి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు మీద కాపు కాసి ఉన్నాడు.

ఇదేమి తెలియని హవ్వ అమాయకంగా ఆ చెట్టు వైపు వెళ్ళింది. అప్పుడు సర్పములో ఉన్న సాతాను హవ్వవైపు తదేకంగా చూస్తుంటే హవ్వ కూడా సర్పము వైపు చూస్తుంది. అప్పుడు సర్పములో ఉన్న సాతాను "ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేని ఫలముల నైనను మీరు తినకూడదని దేవుడు చెప్పాడా?'' అని హవ్వని అడుగుతుంది. అప్పుడు హవ్వ "లేదు, ఈ తోట చెట్లలో దేని ఫలమునైనను మేము తినవచ్చును. అయితే ఈ తోటమధ్యనున్న ఈ చెట్టు ఫలములను మాత్రము తినవద్దని, ముట్టవద్దని చెప్పాడు. ఒకవేళ మేము ఈ చెట్ల ఫలములను తింటే మేము నిశ్చయముగా చనిపోతామని దేవుడు మాతో ఖండితముగా చెప్పాడు" అని చెప్తుంది.

అప్పుడు సర్పములో ఉన్న సాతాను "మీరు చావనే చావరు. ఈ చెట్టు పండ్లు తింటే మీ కన్నులు తెరువబడి మీరు మంచిచెడ్డలు తెలుసుకొని దేవదూతలులాగా ఉంటారని మీ దేవుడికి తెలుసు, అందుకే మిమ్మల్ని తినవద్దని చెప్పాడు" అని హవ్వతో అబద్ధం చెప్తుంది.

అప్పుడు హవ్వ ఆ పండ్లువైపు చూచినప్పుడు ఆ పండ్లు


చాలా అందంగా, తెలివితేటలు ఇచ్చే పండ్లులాగా కనిపించాయి. అప్పుడు హవ్వ ఆ చెట్లు పండ్లు కొసి తినింది. అంతేకాక ఆ పండ్లు తీసుకెళ్ళి తన భర్తయైన ఆదాముకు కూడా ఇచ్చింది. ఆదాము కూడా ఆ పండ్లు తిన్నాడు. అప్పుడు సాతాను చెప్పినట్లే వారి కన్నులు తెరువ బడ్డాయి. అప్పుడు వారి ఒంటి మీద బట్టలు లేక దిగంబరులుగా ఉన్నట్లు తెలుసుకొని తోటలోని అంజూరపు చెట్టు ఆకులు కోసి తమకు కచ్చడములుగా కట్టుకున్నారు. వారు దేవుని ఆజ్ఞను మీరినందుకు వారు దేవునికి భయపడ్డారు.

సాయంత్రం పూట దేవుడు తోటలో సంచరిస్తున్నప్పుడు వారు దేవుని స్వరము విని చెట్ల చాటున దాక్కుంటారు. అప్పుడు దేవుడు "ఆదాము ఎక్కడ వున్నావు?" అని ఆదామును పిలుస్తాడు. అప్పుడు ఆదాము "నేను తోటలో నీ స్వరము వినినప్పుడు నా ఒంటి మీద బట్టలు లేవు. అందుకే భయపడి దాక్కున్నాను" అని చెప్తాడు. అప్పుడు దేవుడు "నీ ఒంటి మీద బట్టలు లేవని నీకు ఎవరు చెప్పారు? తినవద్దని నేను చెప్పిన చెట్ల పండ్లు తిన్నావా?" అని అడుగుతాడు. అప్పుడు ఆదాము "నువ్వు నాతో ఉండటానికి ఇచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్షఫలములు కొన్ని నాకు ఇస్తే నేను తిన్నాను" అని హవ్వ మీద చెప్తాడు. అప్పుడు దేవుడు హవ్వని "నువ్వు చేసినది ఏమిటి?" అని అడిగితే హవ్వ "సర్పము నన్ను మోసం చేసింది" అని చెప్తుంది. అప్పుడు దేవుడు సర్పమును చూచి "నీవు ఇది చేశావు కాబట్టి పశువులన్నిటిలోను, భూజంతువులన్నిటిలో శపించబడినదానవై కడుపుతో ప్రాకుచూ బ్రతికినంత కాలము మన్ను తిందువు. మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకు, ఆమె సంతానమునకు వైరము కలుగు జేసెదను. అది నిన్ను తల మీద కొట్టును. నీవు దానిని మడిమె మీద కొట్టుదువని" శపిస్తాడు.

తర్వాత హవ్వ దగ్గరకు వచ్చి "నీ ప్రయాసమును నీ గర్భవేదనను మిక్కిలి హెచ్చించెదను. వేదనతో పిల్లలను కందువు. నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును. అతడు నిన్ను ఏలును" అని శపిస్తాడు. తర్వాత ఆదాముతో "నీవు నీ భార్య మాట విని, తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్ష ఫలములను తిన్నావు కాబట్టి నీ నిమిత్తము నేల శపించబడి యున్నది. ప్రయాసముతోనే నీవు బ్రతికినంత కాలము దాని పంట తిందువు. అది ముండ్ల తుప్పలను, గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములోని పంట తిందువు. నీవు నేలకు తిరిగి చేరు వరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు. ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి. నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువు" అని శపిస్తాడు. చర్మముతో చొక్కాయిలను చేయించి వాళ్ళకి తొడిగిస్తాడు దేవుడు.

దేవుడు అంతటితో ఆగకుండా వాళ్ళని తోటలో నుండి వెళ్ళగొట్టేస్తాడు. ఎందుకంటే దేవుడు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టుతో పాటు వేసిన జీవవృక్షఫలము చెట్టు పండ్లు తిని నిరంతరం జీవిస్తాడని తెలుసుకొని ఆదాము, హవ్వలను ఏదెను తోటలో నుండి బయటకు పంపివేసి తోటకు కాపలాగా కెరూబులను, జీవవృక్షమునకు పోవు మార్గమును కాపలా కాయడానికి అటు ఇటు తిరిగే ఖడ్గజ్వాలలను పెడతాడు. దేవుడు ఎంతో ఇష్టంగా సృజించుకున్న తన బిడ్డలైన ఆదాము, హవ్వలు సాతాను మాటలు విని దేవుని ఆజ్ఞను ధిక్కరించడం వలన దేవుడు వారికిచ్చిన ఆధిక్యతను పోగొట్టుకొని, ఏ నేల నుండి ఆదాము తీయబడ్డాడో ఆ నేలను సేద్యపరచుటకు తోటలో నుండి వెళ్ళగొట్టబడ్డారు.

చూశారా పిల్లలూ, ఆదాము హవ్వల పరిస్థితి. దేవుడు మనుష్యులని ఎంత ప్రేమిస్తాడో, ఆయన ఆజ్ఞలు పాటించక పోతే అంత శిక్షిస్తాడు. ఆదాము కోసం సమస్తము చేశాడు. వాళ్ళు తినడానికి ఎన్నో రకాల పండ్లు ఇచ్చాడు దేవుడు. కాని తినవద్దని చెప్పింది ఒక్క పండే కదా. అయితే వాళ్ళు దేవుని మాట వినకుండా సాతాను మాట విన్నందువలన వాళ్ళు సమస్తము పోగొట్టుకొని కష్టాల పాలయ్యారు. మనం దేవుని మాట విని దేవునికి లోబడి వుంటే దేవుడు మనకోసం అన్నీ చేస్తాడు. దేవుని మాట వినకుండా దేవునికి వ్యతిరేకంగా చేస్తే ఆదాము హవ్వల లాగానే మనకు కష్టాలు తప్పవు. మరి వచ్చే నెలలో మనం కయీను, హేబేలు కథలు తెలుసుకుందాము.





# బైబిలు ప్రాముఖ్యత

**(Importance of the Bible)**

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

సర్వశక్తిగల దేవుడు, భూమ్యాకాశములను, సృష్టిలోని సమస్తమును తన వాక్కు చేత సృష్టించిన దేవుడు, ఆయన ఇష్టపడి తన స్వరూపంలో తన పోలికె చొప్పున చేసుకొనిన మనుష్యుల కొరకు సమస్తమును అను గ్రహించాడు. మనుష్యులను రక్షించడానికి చివరకు తన ప్రియ కుమారుని సైతం బలిగా అర్పించాడు. అంతగా ప్రేమించిన మనిషి కొరకు ఒక గ్రంథమును వ్రాయించాడంటే, ఆ గ్రంథము ఎంత విలువైనదో, ఎంత ఉన్నత ప్రమాణాలతో సిద్ధపరిచాడో ఆ గ్రంథమును ఆమూలాగ్రం అధ్యాయనం చేస్తే తప్ప అర్ధం కాదు. పరిశుద్ధ గ్రంథము యొక్క గొప్పతనం ఎంటో, అది ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవాల్సిన అవసరతల ప్రతి ఒక్కరికీ ఉంది. ఎందుకంటే భూమి మీద జన్మించిన ప్రతి మనిషి కొరకు సిద్ధపరచబడిన గ్రంథము కాబట్టి. ఈ పరిశుద్ధ గ్రంథమును ఎందుకు చదవాలో ఈ పుస్తకము చదివిన తరువాత మీరు గ్రహించగలరని ఆశిస్తున్నాము.

## బైబిలు చరిత్ర, ఆవిర్భావం:

ఐక్యరాజ్యసమితిలో నమోదు చేయబడిన 160 దేశము లలో మరియు తదితర దేశములలోని 735 కోట్ల 71 లక్షలకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో ఎన్నో మతములు వాటికి ఎన్నో మత గ్రంథములు ఉన్నవి. ఈ మత గ్రంథములన్నిటిలో విరివిగా వాడబడుచున్న గ్రంథము బైబిలు. బైబిలు అను ఇంగ్లీషు పదము బిబ్లియోన్ అను గ్రీకు పదము నుండి వచ్చినది. బిబ్లియోన్ అనగా గ్రంథము అని అర్ధము. ఈ గ్రంథము (వాక్యము) చీకటిగల చోటున వెలుగిచ్చు దీపము వలె ఉండును. ఈ వాక్యము మనుష్యుల స్వంత ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన ప్రేరేపించబడి పలుకబడిన వాక్యము. ఈ పలికిన మాటలు పరిశుద్ధుల ద్వారా వ్రాయబడి భద్రము చేయబడినవి (2పేతురు 1:19-21). పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 3:16ను బట్టి ఈ వాక్యము దైవావేశము వలన కలిగినది. అందుకే దీనిని పరిశుద్ధ గ్రంథము అన్నాము.

ఇది దేవునిచే పలుకబడిన వాక్కు. ఆదికాండము మొదటి అధ్యాయం చూచినట్లైతే... దేవుడు పలుకగా ఆ ప్రకారమాయె నను విషయమును మనం గమనించగలం. ఆయనే వాక్యము అను విషయము యోహాను వ్రాసిన సువార్త మొదటి అధ్యాయం మొదటి వచనంలో గమనించగలం. ఆయనలో జీవము ఉండెను. అనగా ఆయన వాక్యములో జీవముండెను. యేసుక్రీస్తు వారు సమరయ స్త్రీతో పలికిన పలుకులు గమనిం చండి. యోహాను వ్రాసిన సువార్త 4:10లో తనను తాను దేవుని వరముగా పరిచయము చేసికొనినాడు. నీవు నన్ను ఎరిగియుంటే, నీవు నన్ను అడిగినట్లైతే నీకు నేను జీవజలము ఇచ్చెదను అను విషయమును వారి సంభాషణలో మరియు అదే అధ్యాయం 14 వచనంలో నేను ఇచ్చు నీళ్ళు నిత్యజీవము నకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను. ఆయనలో, ఆయన వాక్యంలో జీవము, నిత్యజీవము ఉన్నది.

ఈ పరిశుద్ధ గ్రంథము దేవుని ప్రణాళికను మానవుని పాప పరిస్థితిని వాని రక్షణ మార్గమును పరిశుద్ధుల ఆశీర్వాద మైన నిరీక్షణను తెలియపరచు చున్నది. ఇది దేవుని వాక్కు, ఈ వాక్కు ద్వారా తనను తాను ప్రజలకు ప్రత్యక్షపరచు కున్నాడు. తన చిత్తమును బయలుపరచుచున్నాడు. సృష్టిపై సర్వాధికారము కలిగిన బలమైన వాక్కు (ఆది.1వ అధ్యా, 2 పేతురు 3:5,6). యెహోవా వాక్కు యధార్ధమైనది (కీర్తనలు 33:4). ఆకాశము భూమి గతించిపోవును గాని ఆయన

మాటలు గతింపవు (మత్తయి 24:35). ఇది దేవునితో ప్రారంభింపబడి దేవునితో అంతమగుచ్చుది. ఒక భక్తుడు ఈ పరిశుద్ధ గ్రంథమును 'ప్రయాణికుని పటము', 'యాత్రికుని దుడ్డుకర్ర', 'నావికుని చుక్కాని', 'సైనికుని ఖడ్గము', 'క్రైస్తవుని పతాకము' అని వర్ణించాడు.

ఈ పరిశుద్ధ గ్రంథము 66 పుస్తకముల కలయిక. పాతనిబంధన, క్రొత్త నిబంధన అను రెండు భాగములుగా విభజింపబడినది. పాతనిబంధన క్రీస్తు జననమునకు ముందు, క్రొత్తనిబంధన క్రీస్తు తర్వాత వ్రాయబడినవి. పాతనిబంధనలో 39 పుస్తకములు, క్రొత్తనిబంధనలో 27 పుస్తకములు ఉన్నవి. చాలామంది ఈ పుస్తకముల సంఖ్యలను జ్ఞాపకముంచుకొనుటకు కష్టపడుచూ ఉంటారు. సులభంగా గుర్తుంచుకొనుటకు ఒక చిన్న చిట్కా. Old Testament (పాతనిబంధన), New Testament (క్రొత్తనిబంధన) లలోని అక్షరముల సంఖ్య 3,9 గా గమనించగలము. Old Testament లోని పుస్తకములను 39 గాను, New Testament లోని పుస్తకములను 3X9=27 గాను జ్ఞాపకము ఉంచుకొనగలము.

పాతనిబంధనలో (39), క్రొత్త నిబంధనలో (27) ఈ 66 పుస్తకములను దాదాపు 40 మంది దేవుని భక్తులు హెబ్రీ, కల్దీయుల భాష (కొన్ని చిన్న భాగములు), గ్రీకు, అరామిక్ (కొన్ని చిన్న భాగములు), అను నాలుగు వేర్వేరు భాషలలో 1600 సంవత్సరముల వేర్వేరు కాలాలలో వ్రాసి యున్నారు. ఈ విధముగా అనేకమంది వివిధ కాలములలో, వివిధ పరిస్థితులలో వ్రాసినా ఒకే విషయములో అనగా క్రీస్తు మానవాళికి కలుగజేసిన రక్షణను గూర్చి ఐక్యత కలిగియున్నారు. గ్రంథ ఆరంభము మొదలుకొని గ్రంథ అంతము వరకు ఒకే విషయమును ప్రస్తావించుటలో దేవుని యొక్క ఆలోచన సమ్మిళితమై ఉంది. పాతనిబంధన అంతటిలో పాప పరిహారముకై దేవుని కుమారుని రాకను, క్రొత్తనిబంధనలో దేవుడు తానే శరీరధారిగా జన్మించి తన ప్రాణమును పెట్టి పునరుత్థానుడై తిరిగి రానైయున్న క్రీస్తును గూర్చి వ్రాయబడింది. పాత నిబంధన క్రీస్తు జన్మ ప్రవచనమైతే, క్రొత్త నిబంధన ప్రవచన నెరవేర్పు.

ఈ పాతనిబంధనలో మొదటి ఐదు పుస్తకములైన ఆదికాండము నుండి ద్వితీయోపదేశకాండము వరకు ధర్మశాస్త్రమనియు, యెహోషువ మొదలు నెహెమ్యా వరకు ఉన్న పన్నెండు పుస్తకములను చరిత్ర అనియు యోబు మొదలు పరమగీతముల వరకు ఉన్న ఐదు పుస్తకములను పద్య భాగములనియు యెషయా మొదలు దానియేలు వరకు ఉన్న ఐదు పుస్తకములను పెద్ద ప్రవక్తలనియు హోషేయ మొదలు మలాకీ వరకు ఉన్న పన్నెండు పుస్తకములను చిన్న ప్రవక్తలనియు పిలువబడినవి.

క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలో మొదటి నాలుగు పుస్తకములను అనగా మత్తయి మొదలు యోహాను వరకు సువార్తలనియు, అపొస్తలుల కార్యముల గ్రంథమును ఆది సంఘ చరిత్రయనియు, రోమా పత్రిక మొదలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక వరకు ఉన్న పదమూడు పత్రికలను అపొస్తలుడైన పౌలు వ్రాసిన పత్రికలుగా మరియు హెబ్రీయులకు వ్రాసిన పత్రికను కూడా పౌలు వ్రాసిన పత్రికగా సంఘ చరిత్రకారుల అభిప్రాయము. యాకోబు వ్రాసిన పత్రిక మొదలు యూదా వ్రాసిన పత్రిక వరకు ఇతర భక్తుల పత్రికలు గాను, ఆఖరి పుస్తకమైన ప్రకటన గ్రంథమును ప్రవచన గ్రంథము లేదా దర్శన గ్రంథముగాను వర్ణించబడినవి.

ఆదిమ బైబిల్ వ్రాత ప్రతులు ఏ ఒక్కటియు ఇప్పుడు లేవు. అవి మరుగున పడక మునుపే వాటిని ఆదిమ భక్తులు అతి జాగ్రత్తగా వాటిని "ప్యాచ్మెంట్" అను జంతు చర్మముల మీదను, "వెల్లుమ్" అను లేగ దూడల చర్మములపై, "పాపిరస్" అను చెట్టు బెరడుతో చేయబడిన కాగితపు చుట్టలపై ఎత్తి వ్రాసిరి. వీటిని ఎంతో జాగ్రత్తగా కాపాడుకొనుచు తదుపరి జనాంగమునకు అందించి యున్నారు. ఇలా ఎత్తి వ్రాయబడిన ప్రతులు క్రీస్తుకు పూర్వమే ఐగుప్తీయుల ఎడారులలో కనుగొనబడినవి. తర్వాత ఈ మధ్య కాలంలో 1947లో యెరికో పట్టణమునకు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న "ఖుమ్రాన్" గుహలలో యెషయా, హబక్కూకు గ్రంథములు, హోషేయ, మీకా, నహూము అలాగే మరికొన్ని పుస్తకములు హెబ్రీ బాషలో వ్రాయబడిన వ్యాఖ్యనములు దాదాపు 800 కాగితపు చుట్టలు కనుగొనబడినవి. వాటిని ఆధారం చేసికొని ఇప్పుడు పరిశుద్ధ గ్రంథమును 1600 వేర్వేరు భాషలలోనికి తర్జుమా చేయబడినది. ఇంకనూ వేర్వేరు భాషలలోనికి


తర్జుమాకై ప్రయత్నాలు జరుగుచున్నవి. 15వ శతాబ్దములో అచ్చు యంత్రము ఐరోపా ఖండములో కనుగొనక ముందు ఈ లేఖనములు అతి కష్టముగా చేతి వ్రాతలతో కొంచెము సంఖ్యలో ఉన్నవి. ఒక పుస్తకమును ఎత్తి వ్రాయుటకు ఎంతో ప్రయాస ఎంతో సమయము పట్టెడిది. అయితే ఇప్పుడు ఈ అచ్చు యంత్రము ద్వారా వేల సంఖ్యలో ముద్రించుచున్నారు. అప్పటిలో కొద్దిమంది వద్దనే ఈ బైబిల్ ఉండెడిది. ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉండినది.

రాజ్యాలు మారుతున్నాయి, వాటి సంస్కృతులు మారుతున్నాయి. దశాబ్దాలు గడిచే కొద్ది ఎన్నో మార్పులు వచ్చాయి. పరిశుద్ధ గ్రంథము ఈ విధంగా భద్రపరచబడి అందరికి అందుబాటులోకి ఉండులాగున అన్ని భాషలలోకి తర్జుమా చేయబడింది. బైబిల్ వ్రాయబడుటకు దేవుడు తన బిడ్డలను ఏ విధంగా తన పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడి, ఆత్మావేశము ఆ విధంగానే బైబిల్ భద్రపరచబడి, తర్జుమా చేయబడి ఒక తరము నుండి మరొక తరమునకు అందించాడు, అందించుచున్నాడు. ఈ బైబిల్ ఇంగ్లీషు భాష కంటే ముందు ఆదిమ భాషలైన గ్రీకు, సిరియా (Syrian), కోప్టిక్ (Coptic), గోతిక్ (Gothic), లాటిన్‌లలోకి తర్జుమా చేయబడింది.

ఐగుప్తు దేశములో క్రీ॥పూ॥331లో అలెగ్జాండ్రియా అనే పట్టణము అలెగ్జాండరు ద్వారా స్థాపించబడినది. అంతకు పూర్వమే అనేకమంది యూదులు ఈ ప్రాంతమునకు వలస వచ్చి స్థిర నివాసము ఏర్పరచుకున్నారు. వీరికి గ్రీకు భాష తప్ప వారి పితరుల భాషయైన హెబ్రీ భాష తెలియదు వీరికి అందుబాటులో ఉండుటకు క్రీ॥శ॥200లో పాతనిబంధన గ్రీకు భాషలోనికి తర్జుమా చేయుటకు ప్రారంభించి మొదటిగా మొదటి ఐదు కాండములను ముగించిరి. ఈ తర్జుమాను 70 మంది ఇశ్రాయేలీయుల పెద్దలను అలెగ్జాండ్రియా రప్పించి వారిచే ఈ ఐదు కాండములను తర్జుమా చేయించిరి. ఈ గ్రీకు పాత నిబంధనను సెప్టూజియంట్ (Septugiant) అంటారు. ఇప్పటికి ఈ గ్రీకు పాతనిబంధన గ్రీకు సంఘాలలో విరివిగా వాడబడుచున్నది. ఆదిమ సంఘము ద్వారా అంగీకరింపబడిన నూతన నిబంధన తర్వాత ఈ సెప్టూజియంట్ (గ్రీకు పాత నిబంధన)తో చేర్చబడి పూర్తి బైబిల్‌గా అక్కడ వాడుకొనుచున్నారు. ఇంకొక ముఖ్య విషయమేమిటంటే ఇప్పటికి ఇతర భాషలలోనికి బైబిల్‌ను తర్జుమా చేయు సమయంలో ఈ గ్రీకు బైబిల్‌ను కూడా రెఫర్ చేస్తున్నారు. తూర్పు ఉత్తర దిక్కులకు మధ్యలోనున్న అనగా ఉత్తర మెసపటోమియా (Mesopotomia) ప్రాంతంలో ఉన్న హెబ్రీ జాతి వారికి కూడా వారి భాష రాదు. వీరికి అందుబాటులో ఉండుటకు మొదటిగా పాత నిబంధనను సిరియా భాషలోకి అనువదించారు. తరువాత కొత్తనిబంధనను కూడా అనువదించారు.

క్రైస్తవ్యం ఏ విధంగా ఐగుప్తులోనికి ప్రవేశించిందో తెలియక పోయినా యేసయ్య, పన్నెండుమంది శిష్యుల కాలంలోనే ఐగుప్తులో చాలామంది క్రైస్తవులు ఆది సంఘ కాలంలోనే ఉన్నారు. వీరికి అందుబాటులో ఉండు టకు కోప్టిక్ భాషలోకి బైబిల్‌ను అనువదించారు. కోప్టిక్ ఐగుప్తీయుల భాష.

క్రీ॥శ॥ 4వ శతాబ్దిలో బిషప్ ఉల్‌ఫిలాస్ బైబిల్‌ను గోతిక్ భాషలోకి అనువదించాడు. ఈ గోతిక్ భాష ఇంగ్లీషు, జర్మనీ, డచ్, స్కాండనేవియా భాషలకు మూలభాష. క్రీ॥శ॥ 2 శతాబ్దంలో గ్రీకుల ఆధిపత్యం అంతరించి రోమనుల ఆధిక్యత ప్రబలుచున్న కాలంలో లాటిన్ భాష సంస్కృతి విస్తరించింది. ఈ కాలములో లాటిన్ బైబిల్ అవసరమని గుర్తించిన రోము బిషప్ దమసస్ (Damasus) (క్రీ॥శ॥ 366-384) తన సెక్రటరీ అయిన జెరోము (Jerome)కు ఈ అనువాద పని అప్పగించాడు. మొదట సువార్తలతో ప్రారంభించి, కీర్తనలు ఆ తదుపరి క్రొత్తనిబంధనలోని అని పుస్తకములను లాటిన్ భాషలోనికి అనువదించాడు. ఈ లోపు తాను హెబ్రీ భాషను క్షుణ్ణముగా నేర్చుకొని క్రీ॥శ॥ 405 నాటికి పూర్తి బైబిలును భాషాంతరము చేసినాడు. ఈ లాటిన్ బైబిల్‌ను వల్గేట్ (Vulgate) అన్నారు. మొదట్లో ఈ బైబిల్ అంతగా ఆదరణ పొందక పోయినా తరువాత ఇది రోము అధికారము క్రింద ఉన్న ప్రపంచమంతా విరివిగా వాడబడినది. పశ్చిమ ఐరోపాలోని దేశములలో సువార్త ప్రకటించుటకు ఉపయోగించ బడిన బైబిల్ ఇదే. ఇప్పటికి రోమన్ కాథోలిక్ సంఘము వారు ఈ వల్గేట్‌ను ఆధారము చేసుకొని భాషాంతరము చేయబడిన బైబిల్‌నే గుర్తించుచున్నారు. చేతితో ఎత్తి వ్రాయబడిన లాటిన్ వల్గేట్. లారెన్‌టియన్ లైబ్రరి ఆఫ్ ఫ్లారెన్స్ (Laurentian Library of Florence, Italy). ఇటలీలో భద్రపరచబడి ఉంది. **(సశేషం)**



బ్రదర్ కె.సామ్రాట్

# ఏడు సంఘాలు

**స్ముర్న సంఘము : (గత సంచిక తరువాయి...)**

అయితే మరణ పర్యంతము నమ్మకంగా వుంటే జీవ కిరీటం దొరుకుతుందని వాగ్దానం వుంది. విశ్వసించిన వారందరూ నిత్యజీవాన్ని అనుభవిస్తారు (యోహాను 17:3). క్రీస్తును ప్రేమించి ఆయన సేవ చేసినట్లయితే ఇతర బహు మానాలను దేవుడు మనకు యిస్తాడు. ఇతర కిరీటముల గురించి 1కొరింథీ.9:25, 2తిమోతి 4:8, యాకోబు 1:12, 1పేతురు 5:4లో చూస్తాం. మనకివ్వబడిన ప్రతి పనిలో నమ్మకంగా వుండాలి. ప్రతి సందర్భంలో దేవుని నమ్మాలి. నమ్మకపోతే మన విశ్వాసానికి ముప్పు వాటిల్లుతుంది. “మనం నమ్మకస్తులం కాకపోతే ముప్పు వాటిల్లుతుంది. మనం నమ్మదగని వారమైనను ఆయన నమ్మదగినవాడు (తిమోతి 2:13). మిషనెరీలలో అగ్రగామియైన హడ్సన్ టేలర్ స్వదేశానికి వెళ్ళినప్పుడు తన మిత్రులతో ఇలా అనేవాడు. “మిత్రులారా! మీకు నా జీవిత నైతిక సూత్రాన్ని తెలుప నాశిస్తున్నాను. దాన్ని మీరు మార్కు 11:22లో చూడవచ్చు (మీరు దేవునియందు విశ్వాసముంచుడి) కొన్ని మారులు నేను నమ్మగల్గినా, కొన్ని మారులు నమ్మలేక పోయినా దేవుడు నాకు నమ్మకస్తుడుగా ఉన్నాడన్న గ్రహింపు నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చేది అని చెప్పి ముగించాడు. గనుక మనమాయన్ని నమ్మి, మనం నమ్మకంగా వుంటే జీవకిరీటం పొందుతాం. దేవునికి అత్యంత ప్రీతిపాత్రులమవుతాము.

జయించువాడు రెండవ మరణం వలన ఏ హానియు పొందడని గుర్తు చేస్తున్నాడు. క్రీస్తు కొరకు ప్రాణాలు పోగొట్టుకుంటే పోగొట్టుకోవచ్చు కాని వారికి రెండవ మరణము లేదు. ఆ రెండవ మరణము అగ్నిగుండం (ప్రకటన 20:6). హతసాక్షులకిది ప్రత్యేకమైన వాగ్దానం. గనుక మనం జయించాలి. రెండవ మరణం ఎవరికి? “పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంత కులును వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికు లును, అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు. ఇది రెండవ మరణము. అయితే విశ్వాసులెవరూ ఈ రెండవ మరణంలో పాలు పొందరు. దేవుని మూలముగా పుట్టిన వారందరూ ఈ రెండవ మరణాన్ని జయించిన వారు (1యోహాను 5:4). వారు మరణంలో నుంచి నిత్యజీవములోకి దాటియున్నారు.

**ముగింపు మాటలు :** ప్రియ సంఘమా! పాఠకులారా! ఆదియు అంతమును అల్ఫా-ఓమేగ, మొదటివాడు-కడపటివాడునైన యేసును మరువకండి. నిన్ను జీవింప జేయువాడు ఆయనే. క్రీస్తు శ్రమపడ్డాడు కనుక అట్టి మనసునే ఆయుధముగా ధరించుకొనుడి. మనం సహించ కలిగినంతటి కంటే ఎక్కువగా ప్రభువు మనలను శోధిం చడు. శ్రమలను సహిస్తే ప్రభువు తన్ను ప్రేమించే వారికి వాగ్దానము చేసిన జీవకిరీటమిస్తాడు. శ్రమ జీవితము భక్తులకు అలంకారము.కుమారులైన వారందరూ శ్రమల్లో పాలు పొందుదురు. శ్రమల తర్వాత ఆయన బిడ్డలందరు శుద్ధసువర్ణమువలె ప్రకాశిస్తారు. శ్రమలు గొప్ప జయ కరమైన ఆశీర్వాదానికి నడిపిస్తాయని గ్రహిద్దాం త్రికరణ శుద్ధిగా జీవించి, జీవకిరీటాన్ని పొందుదాం. జీవిత భారాలు ఆయనపై మోపి జయజీవితం జీవిద్దాం. జయజెండా ఎగురవేద్దాం!.

# పెర్గము సంఘము

## (విశ్వాసం లేని సంఘము)

పెర్గము అనే పేరుకు గోపురము లేక దుర్గము అని అర్థం. ఈ పట్టణం చిన్నాసియలోని స్ముర్నకు ఆగ్నేయంగా 50 మైళ్ళ దూరంలో ఉంది. ఈ సంఘకాలం క్రీ.శ.312–606. ఇది తూర్పు దేశాల్లోనికెల్లా సుందరమైన నగరం అని ప్రతీతి. ముసియా ప్రాంతములోని పట్టణమే పెర్గము. కళ, వాఙ్మయము, చాలా వృద్ధిచెందిన దేశం. ఈ పట్టణంలో రెండు లక్షల గ్రంథాలుగల గొప్ప పుస్తక భాండాగారముంది. రోమా ప్రభుత్వం వారు దీనిని అలెక్సంద్రియకు తీసుకొని పోయారు. ఈ గ్రంథాలు ఏంటోని – క్లియోపాత్రకు బహూకరించాడని చరిత్ర చెబుతోంది. అలెక్సంద్రియాలోనే ఇది ఒక గొప్ప గ్రంథాలయం. ఇక్కడ ఎస్క్యులాపియన్ అనే దేవతకు నిర్మించబడిన ఒక గుడి ఉంది. ఈ దేవత పూజకు కేంద్రం ఈ దేవాలయం. విగ్రహారాధన మతానికి ఇదే ముఖ్యస్థానం. ఇంకా గ్రీకు దేవతలైన ద్యుపతి, ఎతెనై, వైద్య దేవతలకు గొప్ప ఆలయాలున్నాయి. ఇటువంటి ఆలయాలకు, గోపురాలకు ప్రసిద్ధి చెందిన కారణాన కాబోలు గోపురం లేక దుర్గము అను పేరు కలిగినది.

ఇక్కడ సంఘంలో స్థిరత్వం లేదు. కొందరు మాంత్రికులు సోదె చెప్పించుకొనువారు, అల్లరితో కూడిన ఆటపాటలయందు ముచ్చటించువారు ఇక్కడున్నారు. "సాతాను సింహాసనమున్న స్థలములో నీవు కాపురమునాన్నవని నేనెరుగుదును" (12వ) వాడియైన రెండంచులుగల ఖడ్గము గలవానిగా ప్రభువు ఈ సంఘానికి ప్రత్యక్షమయ్యాడు. ఆయన నోట నుండి రెండు అంచులుగల ఖడ్గమొకటి బయలు వెడలుచున్నది (1:16). ఇది దేవుని వాక్యఖడ్గమే. ఎందుకనగా దేవుని వాక్యము రెండంచులుగల ఎటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉందని (హెబ్రీ.4:12లో) చూస్తాము. అలాంటి "కృపావాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను" (అపొ.కార్య.20:32) అని పౌలు ప్రబోధిస్తున్నాడు. వాక్యము తన ప్రజల్ని కట్టును. ప్రతి విశ్వాసి దేవుని వాక్యాన్ని అనుసరించాలి. విశ్వాసులున్న స్థలం, పరిస్థితులు, పరిసరాలు, స్థితిగతుల్ని ప్రభువు చూస్తున్నాడు. సాతాను సింహాసనము, సాతాను కాపురమున్న స్థలము అని ప్రభువు చెప్తున్నాడు. ఆ రోజుల్లో ప్రభువుకు బదులుగా కాన్‌స్టాంటైన్ చక్రవర్తి సంఘానికి అధికారిగా ఉన్నాడు. ఇతడు ఎలా అధికారి అయ్యాడో చూద్దాం.

మొదట ఇతడు రోమా రాజ్యాన్ని పరిపాలిస్తున్న రోజులవి. మొదటి నుండి ఇతడు మంచి పరాక్రమ వంతుడు. ఇతడు ఆరంభములో చిన్న చిన్న రాజ్యాల్ని జయించాడు. సర్వలోకానికి రాజు కావాలని ప్రయత్నిస్తుండగా "మార్కదైన్" అను చక్రవర్తితో యుద్ధానికి తలపడగా కాన్‌స్టాంటైన్ ఓడిపోయాడు. పిమ్మట అతడు చింతాక్రాంతుడయ్యాడు. క్రీ.శ. 312 సంllలో అక్టోబరు 27వ తేదిన సాయంకాలం ఇంచుమించు 3 గంటలకు రోమానగరంపై మహాప్రభావముతో కూడిన గొప్ప వెలుగులో ఒక పెద్ద సిలువ క్రింద "సిలువ జెండా" కనిపించిందంట. ఆ పట్టణములోని శకునగాండ్రను మాంత్రికుల్ని పిలువనంపి ఆ దర్శనభావాన్ని అడగ్గా వారు అది అపశకునమని చెప్పారు. రాజు మరింత కృంగిపోయాడు. పిమ్మట అదే దర్శనము అతనికి రెట్టించబడింది. రాజు ధైర్యము తెచ్చుకొని సిలువను, సిలువజెండాను చేయించుకొని యుద్ధానికి వెళ్ళగా జయము లభించింది. చక్రవర్తి క్రైస్తవ్యమును స్వీకరించి, బాప్తిస్మము తీసుకొని క్రైస్తవుడయ్యాడు. చక్రవర్తి క్రైస్తవ మతమును అవలంబించినందున క్రైస్తవ సంఘములో ఈయన ద్వారా లౌకికత్వం ప్రవేశపెట్టబడింది. స్ముర్న సంఘంలో లోకాన్ని శత్రువుగా భావిస్తే పెర్గము సంఘం లోకంతో స్నేహం చేసి లోకంలో కలిసిపోయింది. రాజును, రాజకీయాలను సాతాను తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. లోకం సంఘంలో ప్రవేశించింది. ఆధ్యాత్మిక ఆరాధన అడుగంటిపోయింది. అన్యవిధానాలు సంఘంలోకి చొచ్చుకు వచ్చాయి. ప్రార్థనాలయాల్లో పటాలు ప్రవేశపెట్టబడ్డాయి కొంతకాలానికి ప్రజలు పటాలను ఆరాధించడం మొదలుపెట్టారు. యేసు బాలుడు, కన్య మరియ విగ్రహాలు సంఘములోనికి వచ్చాయి. బయట నుంచి సంఘాన్ని ఏమి చేయలేనని చెప్పి సాతానే సంఘంలో ప్రవేశించాడు. వాక్యం కంటే ఆచారాలందు

వీరికి ఎక్కువ మక్కువ ఏర్పడింది. చిన్నపిల్లలకి బాప్తిస్మము ఇచ్చే బోధ ఈ కాలంలోనే ప్రారంభమైంది. పూర్వకాలం బబులోనులో మగపిల్లల్ని ఎనిమిదవ దినాన్ని ఆడబిడ్డకైతే 9 దినాన్ని సూర్యోదయ సమయమందు పూజారి ఆ బిడ్డను తీసుకొని మంత్రాలు ఉచ్చరించుచూ జలప్రోక్షణం చేసే వాడని చరిత్రలో చూస్తాం. సూర్యదేవునికే ఆ బిడ్డలను సమర్పించడం ఆనాటి వాడుక, పిమ్మట ప్రసంగాలకు బదులు ఆరాధన కార్యక్రమాలు కూడా ప్రవేశపెట్టబడ్డాయి. మంచి విషయాలు: నాయందు విశ్వాసియై ఉండి నన్ను గూర్చి సాక్షియైన "అంతిప" యను వాడు మీ మధ్యను చంపబడిన దినములలో నీవు నా నామమును గట్టిగా చేపట్టి నాయందు విశ్వాసమును విసర్జింపలేదని నేనెరుగు దును (13వ). అంతిప అనే భక్తుడు చాలా గొప్ప విశ్వాసి, దేవుని కొరకు సాక్షిగా జీవించడం మాత్రమే గాక క్రీస్తు కొరకే హతసాక్షి అయ్యాడు. అంతిపా అనే మాటకు తండ్రి కొరకు అని అర్థం. పేరుకు తగ్గటుగా ఆనాటి అన్యాచా రాన్ని, అసహ్యకార్యాల్ని, విగ్రహారాధన్ని ఎదిరించి తండ్రి కొరకు నిలబడ్డాడు. అందుకే క్రీస్తు కొరకు హతసాక్షి కావలసి వచ్చింది. హతసాక్షుల రక్తము భూమి మీద ఒలికింపబడు చున్న సమయంలో పెర్గము సంఘం ఆయన నామాన్ని గట్టిగా చేపట్టిందని వారి విశ్వాసం సడలిపోలేదని ప్రభువు మెచ్చుకుంటున్నాడు. సంఘంలో ఒకరు మరణమై పోయినా వారు విశ్వాసాన్ని గట్టిగా చేపట్టడం ముదావహమే. తుదమట్టుకు స్థిరంగా చేపట్టాలని (హెబ్రీ. 3:6) ఇప్పటి సంఘాన్ని ప్రభువు హెచ్చరిస్తున్నాడు.

**లోపాలు :** అయినను నేను నీ మీద కొన్ని తప్పులను మోపవలసి వచ్చింది (14వ). ఈ సంఘములో ఉన్న తప్పు లేమిటి?

1) విగ్రహములకు బలి ఇచ్చిన వాటిని తినుట. నాలుగు ముఖ్య విగ్రహాలకు కేంద్రం కావటం. పట్టణమంతా విగ్ర హారాధన, పూజలు, నమస్కారాలు విపరీతమైపోయాయి. వారి సహవాసం వలన పరిసరాల దోషం వలన క్రైస్తవ జనాంగం కూడా విగ్రహార్పితమైన వాటిని తింటూ అన్యా చారాలను ఆచరించారు. ఆత్మీయ జ్ఞానంగల విశ్వాసి వాటిని ముట్టకూడదు. ఇలా తినడం వలన మనస్సాక్షి బలహీనమైనదై అపవిత్రమైపోతుంది (1కొరింథీ. 8:4-13). ప్రభువు బల్లమీద ఉన్న వాటిలోను దయ్యముల బల్లమీద వాటిలోను విశ్వాసులు చేతులు పెట్టకూడదు (1కొరింథీ. 10:19,21). ఇలా చేయడం దైవవిరోధ కార్యక్రమం. వారు జారత్వము చేయడానికి ఉపదేశించబడుతున్నారు. ఇదే బిలాము బోధ.

2) తప్పుడు సిద్ధాంతములుగల బోధకుల్ని ఈ సంఘము లోనికి అనుమతించింది. అదే బిలాము బోధ - నికొలా యితుల బోధ. బిలాము బోధ విగ్రహములకు బలి ఇచ్చిన వాటిని తినటానికి, జారత్వానికి నడిపించింది. బిలాము ధనాశపరుడు. బిలాము సిద్ధాంతం ప్రమాదకరం, ధన లాభాన్ని ఆశించిన ప్రవక్త. ఆదిలో ఇశ్రాయేలీయులకు మంచి సంగతుల్నే బోధించాడు (సంఖ్యా. 23:9-10, 19:24, 24:5-9, 16-24) గాని ఇశ్రాయేలీయులు (పాపము చేయునట్లు) శపించుటకు రాజైన బిలాము వద్ద నుండి డబ్బును కోరాడు. రాజుకు చెడ్డసలహా చెప్పాడు. మోయాబు స్త్రీలను ఇశ్రాయేలీయుల విడిదిలోకి దించితే ఇశ్రాయేలీయులు పాపము చేస్తారు. అందుచేత ఇశ్రాయేలీ యులు మోయాబు స్త్రీలతో పాపంచేసి, విగ్రహార్పితమైన ఆహారాన్ని భుజించారు (సంఖ్యా. 25:1). ఈ కుయుక్తి బోధవల్ల ఇశ్రాయేయులు మోసపోయి (యూదా 11వ) వ్యభిచరించి ఒక్క దినాన్నే 23 వేలమంది చనిపోయారు (1కొరింథి. 10:8, యాకోబు 4:4). ప్రియులారా! నేడును బిలాము బోధలు సంఘములో కనిపిస్తున్నాయి. అవి మిశ్రిత వివాహములు, మిశ్రిత సిద్ధాంతాలు. అవిశ్వాసు లను వివాహమాడటం, పెళ్ళి అయ్యాక మార్చుకోవచ్చులే అని పెళ్ళిచేసుకోవడం, వివాహం అయ్యాక మార్చు కుందామని తలంచినవారు అనేకులు విశ్వాసమును వదలు కొని భ్రష్టులైన వారిని నేనెరుగుదును. అవిశ్వాసులతో సంబంధము హానికరం (2కొరింథీ. 6:14-18) ఆత్మీయ అంధత్వము కల్గించుటకు శత్రువు ఉపయోగించేది శత్రువు ఉపయోగించేది ఇలాంటి వాదమే. పాపమును అసహ్యించు కొనని ఏ బోధ అయినా సరే అది బిలాము బోధే. "ఇదిగో

బిలాము మాటనుబట్టి పెయోరు విషయములో ఇశ్రాయేలీయుల చేత యెహోవా మీద తిరుగుబాటు చేయించిన వారు వీరు కారా? అందుచేత యెహోవా సమాజములో తెగులు పుట్టియుండెను కదా! (సంఖ్యా. 31:16) ఇశ్రాయేలీయుల్ని పాడుచేయటం మాత్రమే గాక, బిలాము కూడా అన్యజనులైన మిద్యానీయులతో పాటు ఖడ్గంచేత వధించబడ్డాడు. సంఘాలు నేటి ఈ బిలాములను కనిపెడుతూ ఉండాలి. తాము ఎక్కువ డబ్బు సంపాదించడానికై ప్రజలను పాపంలోనికి, తప్పుడు సిద్ధాంతంలోనికి నడిపిస్తారు (2పేతురు 2:14,15).

రెండవదిగా పెర్గము సంఘములో ప్రభువు అసహ్యించుకొనే నికొలాయితుల బోధను అనుసరించారు. ఎఫెసు సంఘంలో మనం చూచినట్లు కొందరు మాత్రమే సంఘం మీద పెత్తనం చెలాయించాలి అనుకునే వారిని విశ్వాసులు త్రోసిపుచ్చారు. దాన్ని పెర్గములో ప్రభువు దానిని అసహ్యించుకున్నప్పటికీ అదే స్వచ్ఛమైనదని అంగీకరించారు. దేవుని సంఘంలో మానవ ఆధిపత్యమే ఈ బోధ తాత్పర్యం. 7వ చక్రవర్తి అయిన హెన్రీ అనిబోలిన్‌ను వివాహమాడగోరి క్యాతరిన్‌కు విడాకులు ఇవ్వాలనుకున్నాడు. కనుక క్యాతలిక్ సంఘమును వదిలి చర్చి ఆఫ్ ఇంగ్లాండులో చేరి ఆ సంఘానికి దేవుడు ఎన్నిటికీ పరిపాలించలేదు. ధియొత్రేఫేవలె (3యోహాను 9వ) కొందరు సంఘాల్లో ప్రధానత్వము కోరుకుంటారు. క్రొత్తనిబంధన సంఘంలో అధ్యక్షులు, పెద్దలు, పరిచారకులు ఉండాలి గాని ఒక్క వ్యక్తి పాలన ఉండకూడదు. కొరింథీ సంఘంలో కొందరు పౌలుని వెంబడించాలని కోరగా నా కోసం సంఘాన్ని విభజింపవద్దు అని పౌలు (1కొరింథీ. 1:12) కోరాడు. ఆంగ్లికన్‌లు అను తెగవారు బిషప్ ఎదుట వంగి నమస్కరిస్తారు. ప్రజలు యాజకుల్ని పూజించి వారి పాదాలను ముద్దు పెట్టుకుంటారు. ఇది వాక్యానికి విరుద్ధము. అయినా వారి పద్ధతి మార్చుకోరు. ఇంతకూ నేను చెప్పవలసినది ఏమంటే నికొలాయితుల బోధ సంఘానికి అరిష్టం. జనాలు ఆకర్షింపబడవచ్చు. ఈ బోధవల్ల వారు మారుమనస్సు పొందరు. అలాంటి పరిస్థితుల్ని సంఘం అసహ్యించుకోవాలి.

**(సశేషం)**

## బైబిల్ క్విజ్ - 19 జవాబులు

1. దావీదు (1సమూ. 18:1)
2. రామాలోని సమూయేలునొద్దకు (19:18)
3. ఏసెలు అను బండ దగ్గర (20:19)
4. అహీమెలెకు (21:1)
5. ఎదోమీయుడైన దోయేగు (22:18)
6. జీఫు అరణ్యమున ఒక పర్వతమందు (23:14)
7. సౌలు యెహోవాచేత అభిషేకమునొందినందున (24:6)
8. రామాలోని అతని ఇంటి నివేశనములో (25:1)
9. 3000 మందితో (1సమూ. 26:2)
10. మాయోకు (27:2)
11. ఏన్దోరులో (28:7)
12. ఫిలిష్తీయుల సర్దారులు అభ్యంతరము వలన (29:4)
13. అమాలేకీయులు (30:1)
14. యోనాతాను, అబీనాదాబు, మెల్కీషూవ (31:2)
15. యాషారు గ్రంథములో (2 సమూయేలు 1:17-18)
16. ఏడు సంవత్సరముల ఆరునెలలు (2:11)
17. హగ్గీతు (3:4)
18. మెఫీబోషెతు (4:4)
19. హీరాము (5:11)
20. గిబియాలోని అబీనాదాబు ఇంట నుండి (6:4)
21. నాతాను (7:1)
22. హదదెజరు (8:3)
23. సీబా (9:2)
24. నాహాషు (10:2)
25. వసంతకాలమున (11:1)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**

వినుకొండవారివీధి, బాప్టిస్టునగర్, విజయవాడ

సాక్ష్యము

# ఆశపడ్డ ప్రాణము

మా బంధువులలో (అన్యులు) ఒకరు రక్షించబడిన తరువాత సొంత గ్రామంలో ఆలయం లేనందున ఆలయము కట్టినారు. ఆ ఆలయం ప్రతిష్ఠించకముసుపు ఆ గ్రామంలో ఉన్న మా బంధువులకు, ఇతరులకు సువార్త ప్రకటించి ఆలయమునకు ఆహ్వానించాలని నిర్ణయించి, ఆ విషయం నాకు తెలియజేసి తప్పక ఆ దినం నీవు రావాలని చెప్పి తేది మరల చెపుతానని చెప్పారు. నేను ఎంతో సంతోషించి, అలాంటి వాటికి తప్పక వస్తానని నాకు అలా ప్రకటించటం చాలా ఇష్టం అని చెప్పాను.

అలా మాట ఇచ్చిన తరువాత నాకు నా తల్లితండ్రుల వద్ద నుండి ఆనెల 10వ తారీఖు ఫోను వచ్చింది. ఏమంటే మా పెద్దమ్మ (ప్రభువు రక్షణ ఎరుగనివారు) వాళ్ళు తిరుపతి జీపులో వెళుతున్నారని, సమయం కాదని సాకు చెప్పి (మేం కొత్తగా ప్రభువు నమ్మి, బాప్తిస్మం తీసుకొన్నందువల్ల) నెల్లూరులో ఉండే మా యింటికి రాకుండా నెల్లూరు మీద నుండి తిరుపతి వెళ్ళాలను కుంటున్నరని తెలియజేసారు. నీవు బలవంతం చేసిన యెడల వస్తారని చెప్పారు. నేను ఫోను చేసి వాళ్ళతో మాట్లాడినపుడు 10వ తారీఖు తెల్లవారు జామున విజయవాడలో బయలుదేరి మధ్యాహ్నం మా యింటికి వచ్చి, భోజనాలు ముగించుకొని తిరుపతి వెళ్ళుటకు అంగీకరించి మాట ఇచ్చారు.

అయితే మా ఆంటీ 9వ తారీఖు రాత్రి ఫోను చేసి నాకు ముందుగా చెప్పినట్లు ఆ సువార్త ప్రకటించే రోజు రేపు అనగా 10వ తారీఖున ఉదయం 7 గం॥లకు మనం అందరూ బయలుదేరాలి అని చెప్పారు. ఇంక చూడండి నేను ఎటువంటి పరిస్థితులో ఇరుక్కున్నానో మా ఆంటీతో చెప్పాను. రెండు రోజుల క్రితం మా పెద్దమ్మ వాళ్ళు రానంటే, మీరు తేది ఇంకా నిర్ణయించనందున వారిని నెల్లూరు రావటానికి పట్టుబట్టానని, ఇప్పుడు నేను ఎలా వెళ్లాలి. ఒకవేళ నాకు సువార్తకు వెళ్ళటం ఇష్టం (అది దేవుని పని) అని వారి భోజనాలు ఎలాగో హోటల్ నుండి తెప్పించి ఏర్పాటు చేసామనుకోండి. మన క్రైస్తవ ప్రేమ ఎలా ఉండాలి. ప్రభువును ఎరిగిన మనం వారి ముందు మన ప్రవర్తన ఎలా ఉంటుంది. గనుక సువార్తకు రాలేనని చెప్పాను.

ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. ప్రభువా నీవు అన్ని ఎరిగిన దేవుడవు. మాకైతే ఎప్పుడు ఏమి జరుగు తుందో తెలియదు. తండ్రి నా హృదయం నీకు తెలుసు. నిన్ను స్తుతిస్తూ, నిన్ను ప్రకటించే ఆ అద్భుత అవకాశం నాకు ఎంత ఇష్టమో. 10వ తారీఖు సువార్త ఉంటుందని తెలిస్తే, నేను మా బంధువులను పిలువకుండా ఉండే దాన్ని కదా. అసలు రెండూ ఒకేరోజు ఎందుకు రావాలి. నీవు మార్చవచ్చు కదా అని ఏడస్తూనే నిద్రపోయాను. ఉదయాన్నే ఏడు గంటలకు మా ఆంటీ ఫోను చేసారు. నీవు తప్పక రావాలి, కాని ఎలా? నేను రానన్నా వారు పట్టుబట్టి రమ్మని ఆహ్వానిస్తే నేను వెళ్ళకపోతే ఎంత అమర్యాద. ఆంటీ నా ప్రాణం మీతోను ఉంటుంది. ఇక్కడ కేవలం ఇష్టం లేకుండా ఉంటున్నాను. రాలేనని

చెప్పాను. మరల ఎనిమిది గంటలకు మా ఆంటీ మేం వ్యానులో బయలుదేరబోతున్నాం. చివరగా తాళాలు వేయటానికి వస్తూ లాస్టులో మరల నిన్ను పిలుస్తున్నాను అని అన్నారు.

ఈసారి నా మనస్సు నిలుపుకోలేకపోయాను. మా వారితో ఇలా చెప్పాను – రాత్రి ఆంటీతో రావటానికి కుదరని పరిస్థితి అని చెప్పినా ఉదయం ఫోను చేశారు. ఇప్పుడు మరల ఫోను చేసారు. కాబట్టి నాకెందుకో ఆశగా ఉన్నది. ఒక్కసారి పెద్దమ్మ వాళ్ళకి ఫోను చేయండి. ఒకేసారి అనుకొన్న సమయానికి ప్రయాణం చేయం కదా. ఒకవేళ వాళ్లు లేటుగా బయలుదేరారు అనుకోండి. అప్పుడు సాయంత్రానికి అట్లా వాళ్ళు రావచ్చు. ఆంటీ ఇంతగా అడుగుతున్నారు కాబట్టి నేను వెళ్లి కొంతసేపు ఉండి మధ్యాహ్నానికి వచ్చేయవచ్చు. కాబట్టి వాళ్ళు ఎప్పుడు బయలుదేరారో కనుక్కోండి అని ఆత్రుతగా అడిగాను.

మా వారు నా ఆత్రుతనుబట్టి ఫోను చేసారు. అప్పుడే నా ప్రభువు గొప్పతనం నేను తెలుసుకోగలిగాను. ఆశ్చర్యం తిరుపతి ప్రయాణానికి వెళ్ళే ముందురోజు జీపు సర్వీసు చేయించారు. అంతా కండీషన్‌లో ఉంది. ఉదయం ఐదు గంటలకు బయలుదేరితే స్టార్ట్ అవటం లేదని డ్రైవరు చెప్పాడట. అతనికి తెలిసినంతవరకు ట్రై చేసాడట. అయినా కదలలేదని ఉదయం తొమ్మిది గంటలకు సర్వీసింగ్‌కు జీపు తీసుకువెళ్ళాలి. అందులో కొండపైకి ప్రయాణం ఎలాగో సర్వీసుకు వెళ్ళి వచ్చే పాటికి లేటు అవుతుంది. కాబట్టి ప్రయాణాన్ని మరుసటి రోజు ఉదయానికి మార్చుకున్నారని తెలియజేసారు. మేమే ఫోను చేసి చెప్పాలనుకుంటున్నాం అన్నారు. ఇంక నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే మా ఆంటీ వాళ్ళకు ఫోను చేసాం. ఒక్క నిమిషంలో సిద్ధపడి వారితో కలిసాను. జీపులో కూర్చుని ప్రయాణం అంతా పాటలు పాడుతుంటే ఆ ఆనందంలో కన్నీరు కారుతున్నది. ఎందుకంటే ఎంత ప్రేమగల దేవుడు ఆశపడ్డ ప్రాణమును ఎలా తృప్తిపరుస్తున్నాడు. ఎంత సర్వశక్తిగల దేవుడు. ఇంతమంచి దేవుడ్ని నేను తెలుసుకొనుటకు రక్షింపబడుటకు ప్రభువు నాకు కృప ఇచ్చినందుకు ప్రభువుకు ఆ దినమంతా కృతజ్ఞతాస్తుతులు చెల్లించాను. ప్రభువు పనిలో గడిపి ఆ రాత్రి ఇంటికి చేరాము.

**ఆశపడ్డ ప్రాణాన్ని తృప్తిపరిచే దేవుడు మన దేవుడు. యుగయుగములు స్తుతింపబడునుగాక.**

చంద్రకుమారి, కావలి.

## పాఠకులకు గమనిక

‘పరిశుద్ధత’ మాసపత్రిక ద్వారా మిమ్మును ఆధ్యాత్మికంగా బలపరచాలని ప్రతినెలా ఎంతో వ్యయప్రయాసలకోర్చి మీకు పంపిస్తున్నాము. పత్రిక కొరకు ప్రతి నెలా మేము దేవుని వైపు చూస్తున్నాము. అయితే పత్రిక మీ యొక్క ఆధ్యాత్మిక జీవితానికి ఎంతగా ఉపయోగ పడుతుందో, మీరు ఎలాంటి మేలులు పొందుతున్నారో మీ ద్వారా తెలిసుకోవాలని మేము ఎంతగానో ఆశిస్తున్నాము. కాబట్టి పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ మీ యొక్క స్పందన మాకు ‘పోస్టుకార్డు’ ద్వారా లేదా ఈ క్రింది ఫోన్ నంబర్లకు ఎస్.యం.ఎస్ ద్వారా తెలియజేయవలసినదిగా ప్రభువు నామమున మిమ్మును కోరుతున్నాము. **–ఎడిటర్**

**9440217726, 9493950969**

కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19

# HOLY BIBLE SCHOOL

6th Lane, Cloughpet, ONGOLE

# హోలి బైబిల్ స్కూల్

**ఆగష్టు 1వ తేది నుండి బైబిలు పాఠశాల ప్రారంభం**

అర్హత : 10వ తరగతి పాస్/ఫెయిల్

కాలపరిమితి : 6 నెలలు (3 నెలలు క్లాసులు, 3 నెలలు అవుట్‌రీచ్)

మొత్తము 15 మంది విద్యార్థులకు (స్త్రీ/పు) మాత్రమే

**ఉచిత శిక్షణ. మా దగ్గరే ఉండుటకు అవకాశము కలదు.**

**బయట నుండి కూడా రావచ్చును. వసతి మరియు భోజనము ఉచితము**

ఉత్తమమైన బైబిల్ శిక్షణ మరియు అనుభవజ్ఞులైన బైబిల్ టీచర్స్‌తో క్లాసులు జరుపబడును. అమెరికా దేశము నుండి బైబిల్ టీచర్స్ మరియు స్వదేశీ బైబిల్ పండితులచే ప్రతిరోజూ పాఠములు బోధింపబడును గనుక ఆసక్తిగలవారు ఈ అవకాశమును వినియోగించుకొనవలెను.

మరిన్ని వివరములకు సంప్రదించండి :

**రెవ. కె. సామ్రాట్**
**ప్రిన్సిపాల్/సెక్రటరీ**
**హోలీ బైబిల్ స్కూల్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9542417771**

**రెవ.డా॥ కె.జోసఫ్**
**ఫౌండర్/ప్రెసిడెంట్**
**ఐ.ఈ.ఆర్.ఎఫ్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9704255416**

ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి
Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

**3**

# పరలోకము అనగానేమి?

**పరలోకమునకు అనర్హులు :** పరలోకము చేరలేనివారు అర్హత లేనివారిని గూర్చి తెలుసుకుందాము.

1)మత్త7:21 ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతి వాడును పరలోకరాజ్యము చేరలేడు కానీ పరలోకమందున్న నా తండ్రి చిత్తమును చేయువాడే ప్రవేశించును.

కేవలము ప్రార్థించుట మాత్రమే పరలోకము చేరుటకు సరిపోదుగాని తండ్రి ఇష్టము, చిత్తమును నెరవేర్చు వారు పరలోకము చేరగలరు అని దీని భావన.

**2) మత్త.25:41** శపింపబడినవారు, నన్ను విడిచి అపవాదిని వెంబడించిన వారు వాని దూతలకు ఏర్పాటు చేయబడిన నిత్యాగ్నికి వెళ్ళెదరు.

దేవుడు ఎవరిని శపించడు. దేవుడు ప్రేమించువాడు క్షమించువాడు అయితే దానిని పొందుకొనకుండ అలక్ష్యము చేసి శపితమైన కార్యక్రమంలో తలమునకలై, అపవాదిని వెంబడించువారని దీని భావన. ఇట్టివారు నరకమునకు పాత్రులు పరలోకము వీరికి అందనే అందదు. వీరు ప్రవేశించలేరు.

**3) లూకా 13:27** అప్పుడాయన మీరెక్కడి వారో నేను మిమ్ము నెరుగను అక్రమము చేయువారలారా నాయొద్ద నుండి తొలిగి పొండని వారితో చెప్పుదును.

అక్రమ కార్యములు చేయువారు పరలోకము చేరరు.

**4) 1కొరిం.6:9** అన్యాయస్తులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. మోసపోకుడి జారులైనను, విగ్రహారాధీ కులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుష సంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగు బోతులైనను, దూషకులైనను, దోచుకొను వారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.

పై చెప్పబడిన కార్యక్రమములు చేయువారు దేవుని రాజ్యమునకు వారసులుకారు.

**5) గలతి.5:19,21.** శరీర కార్యములు అనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, ద్వేషములు, మత్స రములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలగు వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొన నేరరు.

**6) ప్రక.21:8.** పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యు లును, నరహంతకులు, వ్యభిచారులు, మాంత్రికులు, విగ్రహా రాధికులు, అబద్ధికులందరు అగ్నిగుండములో వేయబడు దురు. ఇది రెండవ మరణము.

**7) ప్రక.22:15.** కుక్కలను, మాంత్రికులును, వ్యభిచారులు, నరహంతకులు, విగ్రహారాధికులు, అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివారును వెలుపట నుందురు.

ఇట్టి క్రియలలో పాలు పొందుకొను వారు పరలోకము చేరక వెలుపల నుందురు. అయితే వెలుపలనున్న వారి కొరకు నరకము సిద్ధము చేయబడియున్నదని గుర్తెరుగవలెను.

**8) రోమా.1:30.** కొండెగాండ్రును, అపవాదకులును, దేవ ద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడు వారును, తల్లిదండ్రులకు అవిధేయులును మాట తప్పువారు, అనురాగరహితులు, నిర్దయులు ఇట్టికార్యములు చేయువారు మరణమునకు తగినవారు. వీరు కూడ పరలోకము చేరలేరు.

**3. దేవుని చిత్తము ఏమిటి? మనకర్తవ్యము ఏమిటి?**

మత్త28:16-20.వరకు గల భాగము నుండి.

పదనొకండు మంది శిష్యులు యేసు తమకు నిర్ణయించిన గలిలయలోని కొండకు వెళ్ళిరి. వారాయనను చూచి ఆయనకు మ్రొక్కిరి గానీ కొందరు సందేహించిరి. అయితే యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము యివ్వబడినది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త

జనులను శిష్యులనుగా చేయుడి" తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏఏ సంగతులు ఆజ్ఞాపించితినో వాటినన్నింటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో యుగ సమాప్తి వరకు సదా కాలము మీతో కూడ వున్నానని వారితో చెప్పెను". యేసుక్రీస్తు వారు శిష్యులకు యిచ్చిన ప్రధానమైన ఆజ్ఞ.

"మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి" ఇది యేసుక్రీస్తు వారి హృదయములోనున్న బలమైన కోరిక. అందరు శిష్యులుగా మార్చబడి వెంబడించు వారిగా వుండాలి. **మార్కు.16:15** మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. ఈ రెండు వాక్యములలోను యేసు ప్రభువు వారు శిష్యులకు చెప్పిన అతి శ్రేష్ఠమైన మాట ఆయన హృదయములో రగులుతూవున్న బలమైన ఆశ ప్రతి ఒక్కరూ సువార్త వినాలి. సువార్త వినిన వారు శిష్యులుగా మార్చబడాలి. ఎందుకనగా "తన చేతులతో తన స్వరూపములో తన పోలికతో ఆయన జీవమును పంచి యిచ్చి ఏర్పాటు చేసుకొన్న మానవుడు సాతానుకు దాసునిగా మారి నశించి పోవుట దేవునికి యిష్టము లేదు. యేసు తాను నిర్మించుకొనిన మానవుడు తనకు సొంతదారుడుగా లేక తన సొంత సొత్తుగ వుండాలి గానీ సాతాను అనుచరుడుగా కాని వాని సొత్తుగ మార్చబడుటగాని దేవునికి ఎంతమాత్రం యిష్టము లేదు.

అయితే ఆదాము ద్వారా సంక్రమించిన పాపము సమస్త మానవ జాతిని కలుషితము చేయగా అందరు, అంతట దేవుని విడచి, మరచి సాతాను సొత్తుగా వాని అనుచరులు గాను మార్చబడుటనుబట్టి దేవుడు శరీరధారిగా ఈ లోకానికి వచ్చారు శిష్యులను ఏర్పాటు చేసుకున్నారు. బలమైన సేవ చేశారు. ఎన్నో మాదిరులు చూపినారు. అద్భుతాలు చేశారు. అన్ని చూచియు ప్రజలు ఆయనను అంగీకరించక అవమానించి సిలువ వేసిరి. అయితే యేసుక్రీస్తు వారి హృదయములో మాత్రము నిలిచియున్న బలమైన కోరిక అందరు అంతట రక్షించబడాలి. అందుకే ఆఖరి దినములలో ప్రభువు శిష్యులను పిలిచి వారిని ఆశీర్వదించి వారికి తన మనస్సులో దాగియున్న బలమైన వాంఛను తెలిపారు.

సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి సమస్త జనులను శిష్యులునిగా చేయుడి.

ఒక వ్యక్తిని పాపము నుండి, శాపము నుండి ఆత్మీయ మరణము నుండి విడిపించ గల్గేది దేవుని సువార్త దేవుని వాక్యము మాత్రమే. ఆ వాక్యములో శక్తి వుంది ఓదార్పు ఉంది. బలము వుంది. ఇట్టి శక్తిగల దేవుని వాక్యము ప్రజలకు అందించబడాలి. తద్వారా ప్రజలు వారి పాపములు విడిచి సాతానును విడిచి యేసును వెంబడించే వారుగా మారాలి అనేది దేవుని ఉద్దేశము.

**యోహాను6:40** కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవమును పొందుటయే నా తండ్రి చిత్తము అంత్యదినమున నేను వానిని లేపుదును.

దేవుని సువార్త వినుట ద్వారాను వినిన వాక్యమునకు లోబడుట ద్వారా ఒక వ్యక్తి రక్షింపబడి తాను పొందుకున్న రక్షణనుబట్టి నిత్యజీవము పొందుకోగలడు. దేవుని యొక్క సేవలో సువార్తను ప్రకటించుట ఒక భాగము అయితే శిష్యలనుగా మార్చుట మరొక భాగముగా వుంది. ఎందుకనగా సువార్తను ప్రకటించునప్పుడు వింటున్నారుగాని, దానిని వెంబడించు వారిగా నుండుట లేదు అందువలన సేవకులే విశ్వాసుల వెంటబడి వారిని ప్రోత్సహించి ఆత్మీయంగా బలపర్చి వారు సంపూర్ణముగా దేవునికి లోబడి వెంబడించు వరకు వారిని వెంబడించాలి. ఇది చాలా కష్టతరమైన బాధ్యతతో కూడిన కార్యక్రమము పేతురుగారు చేపలు పట్టు జాలరి చేపలు దొరికే వరకు వల వేయుట లేదా వేట కొనసాగించుట ఆయన వృత్తి ధర్మం అయితే ప్రభువు పేతురును మనుష్యులను పట్టు జాలరిగా మార్చుతానన్నారు అంటే పేతురుగారు చేపల వేటలో ఎంత నేర్పు, బలము, నైపుణ్యము ఉపయోగించి చేపలు పట్టినారో అదే ఓర్పు, నేర్పు, బలము మనుష్యులను పట్టుటకు కూడా చూపవలసి ఉంది. దేవుని సేవలో అపోస్తులుడైన పౌలుగారు ఇచ్చిన సాక్ష్యము చూద్దాము.

**(సశేషం)**



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 20

2సమూయేలు 12 నుండి 1రాజులు 12 వరకు

1. సొలొమోనుకు నాతాను ప్రవక్త ఏమని పేరు పెట్టెను?
2. అబ్షాలోము సహోదరి పేరు ఏమిటి?
3. యుక్తిగల స్త్రీని యోవాబు ఎక్కడ నుండి పిలిపించెను?
4. దావీదు అబ్షాలోముకు భయపడి తన యింటి వారిని తీసుకొని పారిపోయి ఎక్కడికి వచ్చి బస చేసెను?
5. నరహంతకుడా, దుర్మార్గుడా, ఛీ పో, ఛీ పో అని దావీదును దూషించినది ఎవరు?
6. తాను చెప్పిన ఆలోచన జరగకపోవుట చూచి ఉరి పోసికొని చనిపోయినది ఎవరు?
7. మస్తకి వృక్షమునకు వ్రేలాడుచున్న అబ్షాలోమును చంపినది ఎవరు?
8. దావీదునకు సహాయము చేసిన బర్జిల్లయి యొక్క వయస్సు ఎంత?
9. బెన్యామీనీయుడగు బిక్రి కుమారుని పేరు ఏమిటి?
10. ఎవరినిబట్టి దావీదు కాలములో మూడు సంవత్సరాలు కరువు కలిగెను?
11. "దయగలవారి యెడల నీవు దయ చూపించెదవు" రెఫరెన్సు ఏమిటి?
12. బావిలో దాగియున్న సింహమును చంపిన దావీదు అనుచరులలో ముఖ్యుడు ఎవరు?
13. దావీదు జనసంఖ్య చూచినందుకై దావీదు యొద్దకు పంపబడిన దీర్ఘదర్శి పేరేమిటి?
14. దావీదుకు పరిచర్య చేయుటకు తీసుకు రాబడిన చిన్నదాని పేరు? (1రాజులు)
15. దావీదు ఇశ్రాయేలీయులను ఎంతకాలము ఏలెను?
16. సొలొమోను తన కొరకు యెహోవాను ఏమి కోరెను?
17. సొలొమోను కుమార్తె పేరు ఏమిటి?
18. సొలొమోను హీరామునకు ఎన్ని గోధుమలు ఇచ్చెను?
19. సొలొమోను మందిరమును ఎన్ని సం॥లు కట్టించెను?
20. సొలొమోను తన నగరును ఎన్ని సం॥లు కట్టించెను?
21. మందసమును ఎక్కడ నుండి తీసుకొని వచ్చిరి?
22. హీరాము సొలొమోనుకు ఎంత బంగారము ఇచ్చెను?
23. ఏ దేశపు రాణి సొలొమోను జ్ఞానమును శోధించుటకు వచ్చెను?
24. సొలొమోనుకు రాజకుమార్తెలైన భార్యలు ఎంతమంది?
25. రెహబామునకు ఎక్కడ పట్టాభిషేకము జరిగెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.